డిశంబరు 1990 రూ.4/-

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక



బెలూన్ మేళ

కొత్త సీరియల్స్




* షర్ట్స్
* T షర్ట్స్
* ట్రౌజర్స్
* జీన్స్
* సఫారి సూట్స్ &
* వెడ్డింగ్ చూడిదార్ కుర్తా సూట్స్

ఇంకా లూయిస్ ఫిలిప్స్
THE SIGNED SHIRT
లభించును.

ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత విలాసవంతమైన షోరూమ్ మన్‌హర్‌లో అడుగు పెట్టండి. పురుషులకు ప్రతిష్ఠాత్మక షోరూమ్ అది. రేమాండ్స్, గ్వాలియర్, ఒ.సి.ఎం, డిగ్‌జామ్, విమల్ మరియు ఇతర ప్రముఖ మిల్లుల వస్త్రాలను ఇంకా రెడీమేడ్ గార్మెంట్స్‌ను ఎంచుకోండి.
అత్యుత్తమ నాణ్యతకు చెందిన షర్టింగ్‌లను ధరించి మురిసిపోండి.
నాణ్యతను అభిలషించేవారు "మన్‌హర్‌లో బ్రహ్మాండమైన వస్త్రశ్రేణి ఉన్నదని ఊహించే వచ్చాం" అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

* వెడ్డింగ్ సూట్స్ ప్రత్యేక కౌంటర్ కలదు.

**మన్‌హర్** (A.C.)

బీసెంట్ రోడ్, విజయవాడ — 2.
Ph: 77801, 66172

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక



సంపుటి : 1  సంచిక : 12  చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమి ప్రచురణ  డిశంబరు - 1990


## లోపలి పేజీల్లో ........


### కథలు :


| | |
|---|---|
| చిట్టెలుక | 4 |
| బెన్‌హర్ (సీరియల్) | 7 |
| నక్క-ముత్తాయి రాజు | 9 |
| గుల్లేరు బాలుడు | 16 |
| పాప తెలివి (కార్టూన్ కథ) | 22 |
| ఎర్రజెండ (కార్టూన్ కథ) | 33 |
| గాడిద తెలివి | 37 |
| బంగారు దీవి (సీరియల్) | 41 |
| వసంతసేన | 45 |





### శాస్త్రీయ వ్యాసాలు:


| | |
|---|---|
| నీళ్ళుగా మారిన షర్బత్ | 5 |
| కంప్యూటర్ కబుర్లు | 14 |
| నాంబికార తెగ (మనిషి - మనుగడ) | 39 |

### ఫీచర్స్ :


| | |
|---|---|
| శంకర్ | 3 |
| బెలూన్ మేళ | 21 |
| జనరల్ నాలెడ్జ్ | 27 |
| చెలిమి సమాచార పత్రిక | 28 |
| 19వ ఎక్కం సులభంగా రాయడానికి చిట్కా | 32 |
| విశ్వనాథ్ ఆనంద్ | 34 |
| ఆరోగ్య మంత్రం మీ చేతుల్లోనే ఉంది | 35 |
| పిరమిడ్‌లు | 49 |
| పెంగ్విన్ (పక్షి పరిచయం) | 51 |
| మన సాహిత్యం | 52 |
| కొమరం భీమ్ | 54 |


### ఇతర విషయాలు :


■ కవితలు ■ డిశంబరు కథ ■ ప్రేమను ప్రబోధించే పండుగ క్రిస్మస్ ■ కలం చెలిమి ■ గజబిజ కథ ■ జోక్స్ ■ పిల్లల పేజీ .......



□ సలహాదారులు : శ్రీ బుడ్డిగ సుబ్బరాయన్, శ్రీ దేవిప్రియ, ప్రొఫెసర్ జి. హరగోపాల్, శ్రీ బి. నరసింగరావు, డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, శ్రీచంద్ర, శ్రీమతి తురగా జానకీరాణి, డాక్టర్ మహీధర నళినీమోహన్, శ్రీ అనిల్ ఎగ్స్‌టె, శ్రీ ప్రవీణ్ కపాడియా.
□ సంపాదకులు: వేదకుమార్ □ రూపకల్పన: షరీఫ్ □ సహ సంపాదకులు : జగన్‌మోహన్, □ ఉపసంపాదకులు : చల్లా శ్రీనివాస్
□ చిత్రకారులు: టి.గంగాధర్, సిరాజ్, విజయ్ □ మార్కెటింగ్ మేనేజర్: కరుణాకర్‌రావు □ బిజినెస్ మేనేజర్: జి.ఎ.రతన్‌కుమార్.

బాలచెలిమి, పిల్లల వికాస పత్రిక, 10, హిమాయత్ నగర్, హైదరాబాదు - 29. ముఖచిత్రం ఫొటో : ఎ. శరత్‌బాబు



# చెలిమి లేఖలు

'బాలచెలిమి' రెండవ సంచిక చదివాము. ముఖచిత్రం చూడగానే కొనాలనిపించేంత అందంగా ఉంది. ప్రతి శీర్షిక, ప్రతీకథ ఏదో ఒక విధంగా మాకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్న మీకు మా ప్రత్యేక కృతజ్ఞతలు - మా ముద్దుల 'చెలిమి' ముందు ముందు ఇంకా ఎన్నో వినూత్న ప్రయోగాలు చేయాలని కోరుతూ -

**జేవి విరిత, నెల్లూరు.**

'బాలచెలిమి' రెండవ సంచిక మేము ఆశించిన విధంగా వచ్చింది. పాఠకుల సూచనలకు విలువనిచ్చి పేజీలు, రంగులు పెంచినందుకు మా హృదయపూర్వక అభినందనలు.

**మాధవరావు, విశాఖపట్నం.**

'బాలచెలిమి' నచ్చింది. స్టాంపుల గురించి విశేషాలు తెలియజేసినందుకు సంతోషంగా ఉంది. 'రోదసీలో పుట్టిన తొలిప్రాణి' చాలా బాగుంది. 'తేనెగుడ్లు' కథ చదివిఎంతో ఆనందించాం. కార్టూన్‌కథ 'సమ్మోనరాగం' చదివి నవ్వుకున్నాం.

**అశోక్ యాదవ్, అదిలాబాద్.**

మా పాఠశాలకు 'బాలచెలిమి' వస్తుంది. పిల్లలంతా పత్రిక చదివి ఎంతో ఆనందించారు. కథలు, శీర్షికలు పిల్లలకు నచ్చేలా శ్రద్ధ చూపుతున్న మీకు మా అభినందనలు.

**రామ్మోహన్, అనంతపురం.**

ఏ పత్రిక చేయని వినూత్న ప్రయోగం 'బాలచెలిమి' చేస్తుంది. 'చెలిమిసమాచారం'లో మాకు ఎన్నో విషయాలు తెలుస్తున్నాయి. అది మాకు వార్తాపత్రికలా ఉపయోగపడుతుంది. 'కాబూలీ వాలా' కడుపుబ్బ నవ్వించాడు.

**మాస్టర్ ప్రశాంత్, వినుకొండ**

'బాలచెలిమి' రెండు నంచికలు చదివి దాచుకున్నాము. పక్షులు, జంతువుల పరిచయం చదివి వాటి గురించి తెలుసుకుంటున్నాం. సీరియల్స్ ఉంటే మాకు మరింత ఆనందంగా ఉంటుంది.

**సుజాత, శారద, బెంగుళూరు.**

'బాలచెలిమి' అచ్చమైన పిల్లల పత్రిక అనిపిస్తుంది. పిల్లలకొరకు ఎన్నో ఆటల పేజీలు ప్రవేశపెట్టినందుకు మా పిల్లలు చాలాసంతోషించారు. 'చెలిమి సమాచారం' వార్తపత్రిక చదివినట్లుంది. పిల్లల్ని విజ్ఞానపథంలో తీసుకెళ్లేందుకు 'బాలచెలిమి' ఎంతో ఉపయోగపడుతుందనే నమ్మకం మాకు కుదిరింది.

**శ్రీమతి ఉషారంగనాథ్, హైదరాబాద్.**

'బాలచెలిమి'లో మాకిష్టమైన 'పద చదరంగం' ప్రవేశ పెట్టినందుకు మా కృతజ్ఞతలు. 'కాబూలీవాలా' బాగుంది. మహీధర నళినీ మోహన్ గారి సైన్సు సంగతులు మాకెంతో నచ్చాయి. ముందుముందు మరిన్ని కథలు, శీర్షికలు రావలని ఆశిస్తున్నాము.

**శివ, తెనాలి.**




'బాలచెలిమి' బాగుందని తుఫాన్‌మెయిల్‌లా వస్తున్న ఉత్తరాలు, టెలిగ్రాంలు మమ్మల్ని ఉత్సాహవంతుల్ని చేస్తున్నాయి. 'బాలచెలిమి'ని ఆదరిస్తున్న పాఠకలోకానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ రెండునెలల్లోనే 'బాలచెలిమి' కొత్త ఒరవడితో ఇంతమంది పాఠకుల్ని ఆకట్టుకుందంటే అదంతా పాఠకుల అభిమానమే, 'బాలచెలిమి'ని పాఠశాలల్లోకి తెప్పించుకుని విద్యార్థులచేత చదివిస్తున్నారనే ఉత్తరాలు చూస్తే. మా ఆశయసాధనలో సఫలీకృతులమౌవుతున్నట్లే అనిపిస్తుంది. ముఖ్యంగా 'బాలచెలిమి'తో చెలిమి చేస్తున్న చిన్నారులకు మా కృతజ్ఞతలు. చాలామంది చిన్నారుల కోరిక మేరకు ఈ నెల నుండి రెండు సీరియల్స్ ప్రారంభించాము, కథలు పెంచాము. మరి మీ అభిప్రాయాలు రాస్తారు కదూ! 'బాలచెలిమి'ని ముందు ముందు మీరు ఆశించిన విధంగా రూపొందించేందుకు మా శాయశక్తుల ప్రయత్నిస్తామని మరోసారి హామీ ఇస్తున్నాము.

**సంపాదకులు**


# శంకర్

**పిల్లలంటే ఆయనకు ప్రేమ!**
**పిల్లలందరికీ అతనంటే ఇష్టం!**



పిల్లలకోసం మొట్టమొదటిసారిగా పెయింటిగ్ పోటీలు పెట్టి దేశవిదేశాల పిల్లల మధ్య స్నేహం, పెంపొందేలా చేసిన ఘనుడాయన. పిల్లలకోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పిల్లల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిన వ్యక్తి ఆయన! ఆయనే 'శంకర్'గా అందరికి ఆప్తుడైన 'కేశవ శంకర్ పిళ్ళై'.

శంకర్ జులై 31, 1902లో కాయంగుళం అనే చిన్న ఊరులో జన్మించారు. ఆయన చదువుకునే రోజుల్లోనే కార్టూన్లు వేసేవాడు. ఆయన తన కార్టూన్లతో గాంధీ, జిన్నా, నెహ్రూ, ఇందిరాగాంధి మొదలగు ఎందరోనాయకుల వ్యంగ్యచిత్రాలు గీసి వారిచేత 'సెహబాష్ శంకర్' అనిపించుకున్న అద్భుత ప్రజ్ఞాశాలి. శంకర్ ఎందరోనాయకుల తప్పులను వ్యంగచిత్రాలుగా గీసి వారి తప్పును బయటపెట్టాడు. 1948లో శంకర్స్ వీక్లిని ప్రారంబించి తన విజయకేతన మెగురవేశాడు. అప్పట్లో 'శంకర్స్ వీక్లి' ప్రపంచ ప్రసిద్ధి పొందింది. ఒకవైపు పెద్దల అభిమానాన్ని పొందుతూనే మరోవైపు తన కిష్టమైన పిల్లలకోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టాడు. పిల్లలకోసం అతడు 1965లో దేశ విదేశాలనుండి బొమ్మలను సేకరించి ఢిల్లీలో ఒక డాల్స్ మ్యూజియం ఏర్పాటు చేశాడు. ఈ మ్యూజియంలో దేశ దేశాలకు చెందిన దాదాపు అయిదువేల బొమ్మలు మనకు కనువిందుచేస్తాయి. అలాగే బాలలకోసం బాలల పుస్తకసంస్థ (CBT), చిల్డ్రన్స్ వరల్డ్ అనే పిల్లల ఆంగ్ల పత్రిక, అతిపెద్ద పిల్లల గ్రంథాలయాన్ని నెహ్రూ నివాసంలో ఈయన నెలకొల్పారు, ఇలా పిల్లలకోసం, పిల్లల మధ్య ఆనందంగా శంకర్ గతసంవత్సరం డిసెంబర్ 26న మరణించారు. శంకర్ ఇప్పుడులేకున్నా ఆయన పిల్లల హృదయాల్లో ఎప్పటికీ సజీవంగా నవ్వుతూనే ఉంటారు. ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ సజీవంగా పిల్లల మనస్సుల్లో మెదులుతూనే ఉంటాయి.



# చిట్టెలుక



ఒక చిన్న ఎలుక బయట ప్రపంచం ఎలా ఉంటుందో ఒకసారి చూసివద్దామని సరదాగా బయటికి వెళ్ళి తిరిగి తిరిగి తన తల్లి దగ్గరికి వచ్చి సంతోషంగా తను చూసిన విశేషాలు చెప్పడం ప్రారంభించింది.

'అమ్మా! అమ్మా! ఈ ప్రపంచం ఎంత సుందరంగా ఉందో' అంది ఆనందంగా చప్పట్లు చరుస్తూ.

బిడ్డ ఆనందానికి తల్లి ఎలుక సంతోషిస్తూ- 'ఇంతకీ ఏమేం చూశావ్' అంది.

'మరేమో, నేను రెండు జంతువుల్ని చూశాను. అందులో ఒకటి భయంకరంగా ఉంది. రెండోదేమో చాలా చక్కగా ఉంది' అంది.

'ఇంతకీ అవి ఎలా ఉన్నాయో చెప్పు' అంది తల్లి ఎలుక.

'ఒకదానికి నల్లని కాళ్ళు, తలపై ఎర్రటి కుచ్చు, వాడిగా ఉండే ముక్కు ఉన్నాయి. శరీరమంతా ఈకలతో నిండి ఉంది. నేను దగ్గరికి వెళ్ళగానే గట్టిగా అరిచింది. నాకు భయమేసి పరుగెత్తుకొచ్చా' అంది.

'అది కోడిపుంజు. దాన్నిచూసి భయపడ నవసరం లేదు. మరి రెండవది ఎలా ఉంది?' అని ప్రశ్నించింది తల్లి.

'రెండో జంతువుకి తెల్లమెడ, మెత్తని పాదాలు ఉన్నాయి. శరీరమంతా దూదిలా ఉంది. ముక్కుపైన మీసాల్లాంటి వెంట్రుక లున్నాయి. అది నావైపే తేరిపార చూసింది. అబ్బా అది ఎంత బాగుందో' అని చెప్పింది.

అదివిని వెంటనే తల్లి ఎలుక కంగారు పడుతూ -

'ఓసి వెర్రిదానా! అది పిల్లి. అదే మన శత్రువు. ఎప్పుడైనా ఆకారాన్ని బట్టి మంచిది, చెడ్డది అనినిర్ణయించుకోవద్దు తెలిసిందా. ఇంకానయం అది నిన్ను తినలేదు' అంటూ అక్కున చేర్చుకుంది అమాయకపు చిట్టి ఎలుకను.

**లియో టాల్‌స్టాయ్ కథ**



# నీళ్ళుగా మారిన షర్బత్


స్టేజిపైన మెజీషియన్ ఒక గ్లాసులోని షర్బత్‌ను ఇంకో ఖాళీ గ్లాసులో పోశాడు. ఆశ్చర్యం! షర్బత్ నీళ్ళుగా మారిపోయింది. అందరూ ఆనందంతో చప్పట్లు కొట్టారు.

ఈ మేజిక్ చెయ్యడానికి రెండు గాజు గ్లాసులు, ఎర్రసిరా, చిటికెడు బ్లీచింగ్ పౌడరు కావాలి. మొదటి గ్లాసులో సగం వరకు ఎర్రసిరా కలిపిన నీళ్ళు పోసి ఉంచు. పది చుక్కల నీళ్ళల్లో చిటికెడు బ్లీచింగ్ పౌడరు (ఇది మెడికల్ షాప్‌లో దొరుకుతుంది) కరిగించి రెండవ గ్లాసులో పోసి ఉంచు. పైకి చూడటానికి రెండవ గ్లాసు ఖాళీగా కనిపిస్తుంది. మొదటి గ్లాసులో ఉన్న సిరా నీళ్ళను చూపించి, అది కొత్తరకం రోజ్ షర్బత్ అని మీ స్నేహితులకు చెప్పు. వాళ్ళు చూస్తూ ఉండగా మంత్రం వేస్తున్నట్లు నటించి ఆ షర్బత్‌ను రెండవ గ్లాసులో పొయ్యి. అంతే. రంగు మాయమై షర్బత్, నీళ్ళలా మారిపోతుంది.

ఈ రకమైన మేజిక్ మీలో చాలామంది చాలాసార్లు చేసే ఉంటారు. కాని అది మేజిక్ అని గమనించి ఉండరు. బట్టలకయిన సిరా మరకలు పోగొట్టడానికి ఇదే పద్ధతి అవలంబిస్తారు.

అయితే ఈ మేజిక్ ఎలా జరుగుతూంది ? బ్లీచింగ్ పౌడర్‌లో 'క్లోరిన్' అనే ధాతువు ఉంది. నీటి అణువులలో ఆక్సిజన్, హైడ్రోజన్ అనే పరమాణువులు ఉన్నాయి. క్లోరిన్ వెళ్ళి నీటిలో ఉన్న హైడ్రోజన్‌తో కలుస్తుంది. మిగిలిపోయిన ఆక్సిజన్ పరమాణువులు బహు చురుకైనవి. అవి వెళ్ళి రంగులతో కలిసి, వాటిని వెలిసి పోయేటట్లు చేస్తాయి. బ్లీచింగ్ పౌడర్ రంగు పోగొట్టింది అనడం కంటే ఆక్సిజన్ పరమాణువులు రంగు పోగొట్టాయనడం సబబుగా ఉంటుందేమో!

మహీధర నళినీ మోహన్



Shankar's International Dolls Museum


More than six thousand dolls from over eighty countries throw open a window on the world—

This unique collection of costume dolls presents a cross-section of the peoples of the world





Bride from Delhi


**A project of the Children's Book Trust**
**Nehru House, 4 Bahadur Shah Zafar Marg, New Delhi 110 002.**
**Open 10 a.m.–6 p.m. Monday closed.**



# బెన్‌హర్
## సీరియల్



సువిశాలమైన రోమన్ సామ్రాజ్యంలో జూడా ఒక ప్రాంతం. జూడాలోనే జెరూసలెమ్ నగరం ఉంది. జెరూసలెమ్‌లో జూడా అనే యూదు యువకుడు తన తల్లి, పదమూడేళ్ళ చెల్లెలు తిర్జాతో కలిసి ఉండేవాడు. జూడాది చాలా సంపన్నమైన కుటుంబం. జూడా కుటుంబం చాలా పెద్ద భవనంలో ఉండేది. ఇంట్లో చాలామంది నౌకర్లు ఉండేవారు. జూడా తండ్రి వ్యాపారంలో చాలాధనం గడించాడు. అతను చిన్న వయసులోనే మరణించడం వల్ల, తల్లినీ, చెల్లెల్నీ చూసుకోవలసిన బాధ్యత పదిహేడేళ్ళ కుర్రాడయిన జూడామీద పడింది. జూడాకి యూదుమతమంటే ఎంతో ఇష్టం.

జూడా బాల్యమిత్రుడు మెసాలా. మెసాలా తండ్రి జూడాలో పన్నులు వసూలు చేసే అధికారి. మెసాలాది రోమను కుటుంబం. రోమన్ అయిన మెసాలా, యూదు అయిన జూడా ఎంతో కలిసి మెలిసి ఉండేవారు. కొత్తవాళ్ళు ఎవరన్నా వాళ్ళను చూస్తే అన్నదమ్ములనుకునే వాళ్ళు. మెసాలా జూడా కంటే రెండేళ్ళు పెద్ద. పద్నాలుగో ఏడు రాగానే మెసాలా ఉన్నత విద్య అభ్యసించడానికి రోమ్ నగరానికి వెళ్ళి పోయాడు. అయిదు

సంవత్సరాలు రోమ్‌లో చదువుకుని అతను జూడాకు తిరిగి వచ్చాడు. తన చిన్ననాటి స్నేహితుడు తిరిగి వచ్చాడన్న వార్త జూడాకి ఎంతో సంతోషాన్ని కలిగించింది. మిత్రులిద్దరూ బయట ఉద్యానవనంలో కలుసుకున్నారు.

"నేను రోమ్ నగరంలో హాయిగా కాలం గడిపి వస్తే, నువ్వు ఈ అయిదేళ్ళూ గుడికీ-ఇంటికీ తిరుగుతూ చేతులు ముడుచుకొని కూర్చున్నావు" అని మెసాలా, జూడాని ఎద్దేవా చేశాడు.

"మెసాలా! నువ్వు బాగా మారిపోయావు. రోమనులు అందరికంటే గొప్పవారనీ, రోమను దేవుళ్ళు యూదు దేవుడికంటే ఎక్కువనీ నువ్వు అనుకుంటున్నావు. అనవసరంగా నా మనస్సును బాధపెట్టావు. నేనూ కాలాన్ని వృధా చెయ్యలేదు. యూదు గురువుల వద్ద ఈ అయిదేళ్ళూ ఎంతో నేర్చుకున్నాను. నాకు వాళ్ళు దేవుడి గురించీ, ఇస్రాయిల్ గురించీ ఎన్నో విషయాలు చెప్పారు" అన్నాడు జూడా పౌరుషంతో.

"మీ యూదులు ఎన్నటికీ మారరు. మీ జీవితాలు ఇరుకయినవి. దేవుడి గురించి తప్ప మీకు ఇంకో విషయం మీద ఆసక్తి లేదు. కళలు, విలాసాలు, రోము మహానగరం మీలో ఎలాంటి సంచలనాన్ని కలిగించవు" అన్నాడు మెసాలా. అతని మాటలు, యూదులంటే అతనికి గల చులకన భావాన్ని తెలియ జేస్తున్నాయి.

"నేను ఎంతో ప్రేమించిన నా చిన్ననాటి నేస్తం మెసాలా ఇలా మారిపోవడం నాకు ఎంతో బాధగా ఉంది" అన్నాడు జూడా.

"నేను కాదు మారింది. కాలం మారింది. యుద్ధంకంటే మించింది ఇప్పుడు లేదు. నేను గొప్ప సైనికుడనై ఈ రోమను సామ్రాజ్యాన్ని ఇంకా విశాలం చేస్తాను. నువ్వు మాత్రం ఇల్లు, గుడి పట్టుకుని వేలాడుతున్నావు. నేను ఎంతో డబ్బు గడిస్తాను. పేరు సంపాదిస్తాను. నువ్వు నా మిత్రుడివి కాబట్టి నా సంపద నీతో పంచుకుంటాను" అన్నాడు మెసాలా.



జూడా తల అడ్డంగా తిప్పాడు - "మెసాలా! మన మార్గాలు వేరు. నేను, నాకు ఎంతో ప్రియమైన నా చిన్ననాటి స్నేహితుణ్ణి కలుసుకుందామని వచ్చాను. కానీ...."

"కానీ ఒక రోమన్‌ను కలుసుకొన్నావు... అందులో తప్పేముంది. జూడాలోని యూదుల సంపద దోచుకోవాలన్న ఉద్దేశం నాకు లేదు" అన్నాడు మెసాలా. ఆ మాటలు విని జూడా రోషంతో -

"రోమను సామ్రాజ్యం ఏర్పడక ముందు నుంచీ జూడా ఉంది. ఎంతోమంది జూడాను జయించారు. కాని వాళ్ళంతా ఏమయ్యారు? అంతా ఓడిపోయారు. ఏనాటికయినా జూడా తిరిగి తన స్వేచ్ఛను సంపాదించుకుంటుంది. నేను ఎన్నటికి రోమన్‌ను కాలేను" అన్నాడు.

"సరే రోమన్‌వి కావద్దు. సైనికుడివి కావచ్చుగా! నేనునీకు చేయూత ఇస్తాను. కళ్ళు తెరిచి లోకాన్ని చూడు. నీ యూదు మతచట్టాల్ని ఆచారాల్నీ వదిలి పెట్టు. ప్రపంచం ఎక్కడోలేదు. రోమ్‌నగరంలోనే ఉంది. రోమ్‌నగరం మాత్రమే ప్రపంచాన్ని శాసించ గలుగుతుంది. జూడా ఎప్పుడూ రోమ్‌కి విధేయంగా మాత్రమే మనగలుగుతుంది' అన్నాడు మెసాలా. తరవాత స్నేహితులిద్దరూ ఎవరింటికి వారు వెళ్ళిపోయారు.

(ఇంకావుంది)

# నక్క - ముతాయిరాజు



చాలా కాలం క్రితం చైనాలో ముతాయి అనే ఒక పేదరైతు ఉండేవాడు. అతనికి ఒక చిన్న గుడిసె, కొద్దిపాటి పొలం మాత్రం ఉండేవి. అతని పొలంలో ఒక దానిమ్మ చెట్టు ఉండేది. ఆ చెట్టు విరగకాసినప్పుడు అతను సంతోషంతో గంతులు వేసేవాడు.

ఒకసారి అతని దానిమ్మచెట్టు బాగా కాసింది. ముతాయి ఆనందానికి పట్టపగ్గాలు లేవు. అయితే అతని సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. రోజూ రెండు దానిమ్మ పండ్లు చెట్టునుంచి మాయమవసాగాయి. ముతాయికి ఏమీ అంతుపట్టలేదు. ఎలాగయినాసరే దానిమ్మ వళ్ళని ఎవరు కాజేస్తున్నారో తెలుసుకోవాలనుకున్నాడు. అందుకే రాత్రంతా మేలుకొని చెట్టువైపే చూస్తూ కూర్చున్నాడు. దొంగను పట్టుకోవాలనుకున్నాడు. మరునాడు ఆ చెట్టు చుట్టూ జిగురు చల్లాడు. మామూలుగా పళ్ళను దొంగిలించడానికి వచ్చిన ఆనక్కకాళ్ళు జిగురుకు అతుక్కుపోయాయి. తనను చంపవద్దనీ, తనను వదిలేస్తే, అతనికి ఒక రాజకుమార్తెతో వివాహం జరిగేటట్లు చూస్తాననీ నక్క బతిమాలింది. ఒక వారం రోజుల్లో మాట నిలబెట్టుకోవాలని హెచ్చరించి ముతాయి నక్కను వదిలి పెట్టాడు.

తరవాత ఆనక్క ఒక చక్రవర్తి ధనాగారంలో జొరబడి కొన్ని ముత్యాలను దొంగిలించింది. మరునాడు ఆ చక్రవర్తి సభకు వెళ్ళింది. తను ముతాయి చక్రవర్తి బంటునని, ఆయన దగ్గర లెక్కలేనన్ని మణి మాణిక్యాలున్నాయని వాటిని వేరుచేయడానికి ఒక జల్లెడ కావాలని అడిగింది. చక్రవర్తి దానికి ఒక జల్లెడ ఇచ్చాడు. రెండు రోజుల తర్వాత నక్క తిరిగి చక్రవర్తి సభకు వెళ్ళింది. జల్లెడతో పని అయిపోయిందని చెబుతూ జల్లెడను, సభలో నేలమీద పెట్టింది. అలా పెడుతూ ఆ జల్లెడలో ఎనిమిది ముత్యాలను కావాలని వదిలేసింది




రాజసేవకులు జల్లెడను చక్రవర్తిచేతికి ఇచ్చి నపుడు అందులో ఉన్న ఎనిమిది ముత్యాలు చక్రవర్తి ఒడిలో పడ్డాయి. ఆ ముత్యాలను చూసి చక్రవర్తి ఆశ్చర్యపడ్డాడు. ముతాయి చక్రవర్తి వద్ద ఇలాంటి ముత్యాలు, రత్నాలు, మణులు లెక్కలేనన్ని ఉన్నాయని, జల్లెడలో ఉండిపోయిన ముత్యాలు చాలా చిన్నవి కావడం వల్ల వాటిని తను పట్టించుకోలేదని చక్రవర్తిముందు నక్క దర్పం ఒలకబోసింది. ఆ ముత్యాలను చక్రవర్తికి కానుకగా ఇచ్చేసింది.

చక్రవర్తి నక్కను పక్కకు తీసుకువెళ్ళి రహస్యంగా మాట్లాడాడు. "నేను ముసలి వాణ్ణయి పోతున్నాను. నాకూతురుకి ఇంకా పెళ్ళికాలేదు. అదొక్కటే నావిచారం. నువ్వు మధ్యవర్తిగా ఉండి నా కూతురుకీ మీ ముతాయి చక్రవర్తికీ పెళ్ళి జరిపించు" అన్నాడు. నక్క సంతోషంతో ఒప్పుకుంది. చక్రవర్తి కూతురుకి తమ ముతాయి చక్రవర్తి సరియైన జోడి అనీ పెళ్ళి తప్పక కుదురుస్తాననీ చెప్పింది. అంతే కాదు ఒక వారం లోపలే తను వచ్చి వివాహ వేడుకలలో స్వయంగా పాల్గొంటానని చెప్పి వెళ్ళిపోయింది.

నక్కతెచ్చిన వార్తవిని ముతాయి సంతోషంతో తలమునకలయ్యాడు. వెంటనే విచారం కూడా అతన్ని ఆవరించింది. అతని దగ్గర రాజకుమార్తెకు ఇవ్వడానికి ఏ విలువైన కానుకలు లేవు. కనీసం పెళ్ళినాడు వేసుకోవడానికి కొత్త బట్టలైనా లేవు. చివరికి మంచి చెప్పులు కూడా లేవు. అయితే నక్క అతనికి ధైర్యం చెప్పింది. అంతా సవ్యంగా జరిగిపోతుందనీ ఒక వారం రోజులలోగా పెళ్ళికి వెళ్ళడానికి తయారుగా ఉండమనీ చెప్పి వెళ్ళిపోయింది.

వారంరోజుల తర్వాత నక్క ఒక కంబళి తీసుకుని ముతాయి దగ్గరికి వచ్చింది. ముతాయీ, నక్కా పెళ్ళికి బయలుదేరారు. చక్రవర్తి నగరం దగ్గరకు రాగానే నక్క, ముతాయిని అక్కడే ఉన్న ఒక సరస్సులో దూకమంది. నక్క చెప్పినట్లుగా ముతాయి సరస్సులో దూకాడు. చలిలో గజగజ వణుకుతూ ముతాయి సరస్సులోనుంచి బయటకు రాగానే, నక్క అతని చిరిగిన దుస్తులను విప్పించి దూరంగా విసిరేసి తనుతెచ్చిన కంబళి అతని ఒంటిమీద కప్పింది. తరవాత ఇద్దరూ రాజధానికి వెళ్ళారు.

రాజసభలో కంబళి కప్పుకొని చలికి వణుకుతూ నిలుచుని ఉన్న ముతాయిని చూపిస్తూ "మహారాజా, నేను, ముతాయి చక్రవర్తిని తీసుకు వచ్చాను" అని నక్క చక్రవర్తికి చెప్పింది. "మాకు మార్గంలో ఎన్నో కష్టాలు వచ్చాయి, పట్టుబట్టలు, విలువైన నగలు, వెలలేని మణులు నలభై ఒంటెలమీద పెట్టుకుని మేముపెళ్ళికి బయలుదేరాము. మీ నగరం అవతల ఉన్న నది మీద వంతెన దాటుతుంటే, మా ఒంటెల బరువుకు ఆ వంతెన కూలి అందరం నదిలో పడిపోయాము. మా సామానులు, ఒంటెలు నదిలో కొట్టుకు పోయాయి. మేము మాత్రం ఎలాగో ప్రాణాలతో బయట పడ్డాం" అంది.



నలభై ఒంటెలమీద విలువైన సామానులు నింపుకు వచ్చామని నక్క చెప్పిన వార్త చక్రవర్తిని తబ్బిబ్బు చేసింది. వెంటనే అతను దర్జీవాళ్ళను పిలిపించి, ముతాయికి రాచఠీవికి తగినట్లు దుస్తులు కుట్టమని ఆదేశించాడు. ఆ రోజు సాయంత్రమే ముతాయికి, చక్రవర్తి కూతురుకి వైభవంగా పెళ్ళి జరిగిపోయింది. అంత సంతోషంలోనూ ముతాయి గుండెల్లో పుట్టెడు దిగులు నిండి ఉంది. చుట్టూ ఎవరూ లేకుండా చూసి నక్కతో తన బాధను చెప్పుకున్నాడు.

"పెళ్ళి చేసుకోవడం, అందరిచేతా చక్రవర్తి అనిపించుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. కానీ నా భార్య నా యింటికి వచ్చి నా



పేదరికాన్ని చూసినప్పుడు ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు" అన్నాడు.

నక్క అతని భయాలను కొట్టిపారేసి, అతనికి ధైర్యం చెప్పింది. మరునాడు విందు ముగిశాక, ముతాయి భార్యతో తన యింటికి బయలుదేరాడు. వారివెంట గుర్రాలు, గాడిదలు, బళ్ళు ఎన్నో ఉన్నాయి. ముతాయికి భయంతో ముచ్చె మటలు పోశాయి. సలహాకోసం నక్కను పిలిచాడు. కానీ నక్క ఎక్కడా కనిపించలేదు.

నక్క, ముతాయి బృందంకంటే చాలా ముందుగా పరిగెత్తుతూ వెళ్ళిపోయింది. అలా వెళ్ళిన నక్క ముప్ఫయి ఒంటెలమీద సామానులు వేసుకుని వస్తున్న వ్యాపారస్తుల బృందం ముందు ఆగింది. కళ్ళనిండా భయం నింపుకుని, ముతాయి బృందం వస్తున్న దిక్కుకేసి చూపిస్తూ -

"అటునుండి ఒక పెద్ద దొంగల ముఠా వస్తోంది. మీరు వెనక్కి తిరిగి పారిపోతే తప్ప మీ ప్రాణాలు మీకు దక్కవు" అంది.

వ్యాపారస్తులు నక్క చూపించినవైపు చూశారు. గుర్రాల సకిలింపులు వినిపించాయి. గుర్రాల పరుగువల్ల గాలిలో లేచిన ధూళి వారికి కనిపించింది. ఆ దొంగల ముఠానుంచి తప్పించుకొని పారిపోవడం సాధ్యంకాదని వారికి తెలిసిపోయింది. తమను ఎలాగయినా కాపాడమని నక్కను బతిమాలారు.

"మీరు ప్రాణాలతో బయటపడాలంటే ఒకే మార్గముంది. ఆ దొంగల గుంపు మీ దగ్గరకు



వచ్చినప్పుడు మీరందరూ తలలువంచుకుని, 'మేమంతా ముతాయి చక్రవర్తి సేవకులం' అనాలి - అని నక్క వ్యాపారస్తులకు సలహా ఇచ్చింది. వాళ్లు అలాగే అన్నారు. వ్యాపారస్తులు తనను చూసి 'మేమంతా ముతాయి చక్రవర్తి సేవకులం' అనడం ముతాయికి ఆశ్చర్యం కలిగించింది.

తరవాత నక్క ముందుకు పరుగెత్తి పశువుల కాపరులను కలుసుకుంది. దూసుకు వస్తున్న దొంగల గుంపు గురించి చెప్పింది. వాళ్ళు భయంతో గజగజ వణికిపోయారు. తమను కాపాడమని నక్కను వేడుకున్నారు. "మీరు బతికి ఉండాలంటే ఒకటే ఉపాయముంది. ఆ దొంగల గుంపు మీ దగ్గరకు రాగానే 'మేమేంతా ముతాయి చక్రవర్తి గుర్రాలను పశువులను కాస్తున్నాం' అని అరవండి. మీ ప్రాణాలకు ఢోకా ఉండదు" అంది.

**షాప్‌కెళ్ళి కొనాలన్న ఇబ్బందీ ఉండదు**

**దొరకదన్న బెంగా ఉండదు**

**పిల్లలను మెప్పించే పత్రిక నెలనెలా నేరుగా మీ ముంగిట్లో వాలుతుంది.**



**8/- రూ॥ల తగ్గింపు**

**ఏడాది చందా రూ. 40/-**

ఆలస్యం చేయకుండా ఈ కింది కూపన్ నింపి పంపండి 'చెలిమి' మీకు సకాలంలో అందుతుంది.

పేరు ____________________

చిరునామా ____________________

____________________

____________________

పిన్ ____________

ఏడాది చందా 40/- M.O./P.O/ D.D. ద్వారా పంపుతున్నాను.

పై అడ్రస్‌కు ఏడాదిపాటు బాలచెలిమిని పంపండి.


సంతకం

**బాలచెలిమి**


10, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 29

ఫోన్: 65669 గ్రామ్స్ : **CHELIMI**


మొట్టమొదటి మోటారు సైకిల్‌ను 'గాట్‌లైబ్ డైమ్‌లర్' 1885లో తయారు చేశారు. దీనికి బ్యాలన్స్ కోసం రెండు చక్రాలు అదనంగా అమర్చారు.



రష్యావారి ఈ 'లునోఖోడ్ మూన్‌బగ్గీ' చంద్రునిపై 1970లో దిగింది. 1.2 మీటర్ల పొడవున్న ఈ 'బగ్గీ' చంద్రునిపై పదిన్నర నెలలు తిరిగి 20,000లకు పైగా ఫోటోలు తీసింది



ఇది జపాన్ వారి 'మోనోరైల్ ట్రైన్'. ఇది గాలిలో వేలాడుతూ పోతుంది. ఈ రైలు ప్రయాణీకులను టోక్యోనుండి దగ్గరలోని విమానాశ్రయానికి తీసుకు వెళ్తోంది.



ముతాయి బృందం దగ్గరకు రాగానే వాళ్ళంతా నక్క చెప్పినట్టుగానే అరిచారు. ఇలా ముతాయి బృందం ముందుకు సాగుతున్నంతసేపు రైతులు, వ్యాపారస్తులు, బిచ్చగాళ్ళు ముతాయి చక్రవర్తికి జయజయధ్వానాలు పలికారు.

పాపం! రోజంతా పరిగెత్తిన నక్క, ఆయాసంతో రొప్పుతూంది. అలా రొప్పుతున్న నక్కకు ముతాయి ఇంటికి సమీపంలోనే ఒక పర్వతంలో మలచబడిన రాజభవనం కనిపించింది. ఆ రాజభవనం ఒక దయ్యానిది. కాపలా భటులకు టోకరావేసి నక్క, ఆ దయ్యం పడుకునే గదిలోకి దూరింది. దయ్యం ఉన్న పరుపుమీదకు ఒక్క గెంతులో దూకి దయ్యాన్ని నేలపైకి లాగివేసింది.

"దయ్యపురాజా! నీ ప్రాణాల మీదకు ముంచుకు వచ్చింది. నీ భవనం బయట వందల మంది దొంగలు ఉన్నారు. వాళ్ళంతా గోడలు పగలగొట్టుకొని లోపలికి వస్తున్నారు. నిన్ను చంపి తీరుతామని వాళ్ళు శపథం పట్టారు. నువ్వు బతికి బయటపడాలంటే నీ పొయ్యి వెనుక గూటిలో దాక్కో" అంది నక్క.

దయ్యం ఎలాగో పొగ గూటిలో ఇరుక్కుని కూచుంది. వెంటనే నక్క పొయ్యినిండా కట్టెలుపెట్టి పెద్ద మంట వేసింది. ఆ మంటలు దయ్యాన్ని కాల్చివేయసాగాయి. తనను కాపాడమని దయ్యం బొబ్బలుపెట్టింది. నక్క ఆ పెడబొబ్బలు పట్టించుకోకుండా మంటను ఇంకా ఎక్కువ చేసింది. చివరికి ఆ దయ్యం మంటల్లో కాలిపోయి బూడిద అయింది. నక్క, బూడిద అయిన దయ్యాన్ని కిటికీలోంచి అవతలికి విసిరివేసింది.

తరవాత నక్క, బయటికి వచ్చి దయ్యం చచ్చిపోయిందని, కొద్ది సేపట్లోనే కొత్త చక్రవర్తి వస్తున్నాడని కాపలావాళ్ళతో చెప్పింది రాజభవనం సేవకులందరు, రెండు వైపులా బారులుతీర్చి నిలబడి ముతాయి చక్రవర్తికి స్వాగతం చెప్పారు. ముతాయి, దయ్యపు రాజ్యానికి కొత్త చక్రవర్తి అయినాడు. నక్కను




తన ముఖ్యమంత్రిగా చేసుకున్నాడు. ముతాయి చక్రవర్తి ప్రజలను కన్నబిడ్డలవలె పాలిస్తూ, అందరిచేత మంచి అనిపించు కున్నాడు. ముతాయి చక్రవర్తి నక్కను అడగకుండా ఏ నిర్ణయం తీసుకునేవాడు కాదు.

పది సంవత్సరాల తరవాత నక్క చచ్చిపోయింది. ముతాయి చక్రవర్తి, తన ఆప్త మిత్రుడి జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోవాలనే ఉద్దేశంతో నక్క వెంట్రుకలతో ఒక టోపీ తయారు చేయించాడు. ఆ టోపీ ప్రజలందరికీ నచ్చింది. అందుకే ఇప్పటికీ అక్కడి ప్రజలు, నక్క చనిపోగానే దాని బొచ్చుతో టోపీ తయారు చేస్తారు.

—సురేశ్ ఆత్మారామ్

**గుండెజబ్బుకు 'మిరియం'**

మిరియాలు తింటే గుండెజబ్బు రాదని డాక్టర్ జాన్ నెగుతెస్కో అంటున్నారు. ఈయన దేశమైన రుమేనియాలో మిరియాలు ఎక్కువగా వాడే రైతులకు ఎప్పుడూ గుండ జబ్బులు రాలేదట. అదే ఈయన పరిశోధనకు కారణమైంది. రోజూ ఒక మిరియం తింటే గుండజబ్బు రాదని ఈయన అంటున్నారు.



# కంప్యూటర్!

**పిల్లలూ.......** ఇంతవరకు కంప్యూటర్ ఏమేం చేస్తుంది. దాని గొప్పతనమేమిటో తెలుసుకున్నాంకదా! ఈసారి కంప్యూటర్‌తో ఎలా పని చేయించుకోవచ్చో తెలుసుకుందాం.

మనం ఏదైనా యంత్రాన్ని పని చేయించాలంటే దానికున్న బటన్‌లు నొక్కుతాం. ఉదాహరణకు రేడియో వినాలంటే దానికుండే ON/OFF బటన్‌లు నొక్కుతాం. అంతేనా. రేడియోలోకంటే, కాలిక్యులేటర్‌లో, కాలిక్యులేటర్‌లోకంటే కంప్యూటర్‌లో ఎక్కువ బటన్‌లుంటాయి. కంప్యూటర్‌లో ఉన్న కీ బోర్డ్‌లో A నుండి Z వరకు, 0 నుండి 9 వరకు, ఇంకా +, -, x, %, < మొదలైన గుర్తులు చాలా ఉంటాయి. వీటిని ఉపయోగించే మనం కంప్యూటర్‌కు అర్థమైన భాషలో సూచనలివ్వాలి. ఇలా కంప్యూటర్‌లో మనకు కావలసిన అనేక రకాల పనులు చేయించుకోవచ్చు. మనం కీ బోర్డ్‌లో C అనే బటన్ నొక్కామనుకోండి. అది డిస్ప్లే యూనిట్‌పై కనబడుతుంది. మన సూచనలు పూర్తిగా కంప్యూటర్‌కు ఇచ్చిన తర్వాత Return అనే బటన్ నొక్కితే కంప్యూటర్ మనం ఇచ్చిన సూచనలకు అనుగుణంగా పనిచేసిపెడుతుంది. మనమిచ్చే ఈ సూచనలు (Commands) అన్నింటిని కలిపి 'Operating System Commands' అంటారు. కంప్యూటర్‌ను ఉపయోగించాలంటే ముందు ఇవి తెలిసుండాలి. ఈ Operating System Commands చాలా రకాలున్నాయి. వాటిలో కొన్ని MS-DOS, UNIX, VAX-VMS, ZENIX మొదలైనవి. ఇవన్నీ Operating System పేర్లు. మనం కంప్యూటర్ ఉపయోగించాలంటే, కంప్యూటర్ ఏ కంపెనీదైనా కానీయండి. మనకు తెలియవలసింది Operating System పేరు. ఈ సిస్టమ్ Software Category (S/W) లోకి వస్తుంది. కంప్యూటర్‌లో మనకు కనబడే వైర్లు, Cards అన్నీ Hardware (H/W) కిందికి వస్తాయి. ఉదాహరణకు ఒక టేప్ రికార్డర్‌ను తీసుకుంటే మనకు కనబడే టేప్‌రికార్డర్, కాసెట్, Hardware కిందికి, కాసెట్‌పై మనం రికార్డ్ చేసిన పాటలు, మాటలు Software కిందికి వస్తాయి. మనం టేప్ రికార్డును (H/W) ఉపయోగించి పాటలు, మాటలు (S/W) వింటాం కదా! అలాగే కంప్యూటర్‌లోని H/W ను ఉపయోగించి S/W పనిచేసేటట్లు చేస్తాం.

కంప్యూటర్‌లో మనకు కావలసిన పనిని పదే పదే చేయించొచ్చు. ఈ పనిని 'Programme' అంటారు. Operating System ద్వారా ముందే కంప్యూటర్‌లో నిర్ణయించిన పనులు మాత్రమే

చేసుకోవచ్చు. ఇంకా ఎక్కువ పనులు చేయించు కోవాలంటే మనం 'Programme' రాయాలి. ఈ Programme రాయడానికి కొన్ని భాషలున్నాయి. ఉదా: COBAL, FORTRAN, C, BASIC, PASCAL ఇలా ఎన్నో ఉన్నాయి. ఇవి ఇంగ్లీషులాగే ఉంటాయి. కాని ఒక భాష నుండి ఇంకొక భాషకు తేడా ఉంటాయి. ఉదా: మనకు ఉన్న (.) ఫుల్‌స్టాప్ బదులు కొన్ని భాషల్లో (;) సెమికోలన్ ఉపయోగిస్తారు.


ఇలా రాసిన 'Programme' అన్నింటినీ కలిపి Application Software అంటారు.



మనం టేప్‌రికార్డ్‌లోని రెడీమేడ్ కాసెట్స్ ఎలా కొంటామో, రెడీమేడ్ 'Programme' కూడా కొనుక్కొని వాడుకోవచ్చు. ఇందుకు ఉదా: Lotus 1-2-3, Spread Sheet, dibase-III మొదలైనవి. టేప్‌రికార్డ్‌లోని పాటలు కాసెట్‌లో ఉన్నట్లు, కంప్యూటర్‌లో Software, Hard Disc అనేదానిపైన, Flopy disc, Cartiolg్ అనే వాటిపైన ఉంటాయి. వీటన్నింటిని Secondary storage అంటారు.

వచ్చేనెల మరిన్ని కబుర్లు.

—తోటరమేష్




*Dealers :*


**IN ALL KINDS OF STEEL FURNITURE**
**Like School Benches, Chairs, Slotted Angle Racks, Office Equipments etc.**

**sonalika industries**

**Show Room :**
1-8-560/7, Ajay Shopping Centre,
RTC 'X" Roads, Opp. Sandhya Theatre,
HYDERABAD - 500 020.

# గుల్లేరు బాలుడు





మా తరగతిలో 'బోధిరాజు' అనే విద్యార్థి మా అందరికంటే పెద్దవాడు. వాడంటే మాకందరికీ భయమే. ఎందుకంటే వాడిలో మంచితనం మచ్చుకయినా కనిపించేదికాదు. ఎవరినైనా గిల్లాడంటే బుజమంతా వాచిపోయేది. వాడు తూనీగల్ని పట్టుకుని, వాటి కొండి పీకి పారేసేవాడు. తరవాత ఆ తూనీగకు దారంకట్టి గాలిపటంలా ఎగరేసేవాడు. పువ్వుల మీదో, ఆకులమీదో వాలిన సీతాకోక చిలుకల్ని ఒక్క ఉదుటున దూకి పట్టుకుని, తన వేళ్లతో నలిపి చంపేసేవాడు. లేకపోతే వాటి శరీరంగుండా గుండు సూది గుచ్చి వాటిని తన పుస్తకంలో పెట్టుకునేవాడు.

బోధిరాజును చూస్తుంటే, వాడికి నిలువెల్లా విషమే అనిపించేది మాకు. ఏ పామో, తేలో వాణ్ణి కాటువేస్తే అది చచ్చిపోతుందే కాని వాడికేం హాని జరగదు అనిపించేది. వాడి చేతిలో యెప్పుడూ ఒక 'గుల్లేరు' ఉండేది. దానితో గురిచూసి పక్షుల్ని కొట్టేవాడు. ఒక్కొక్కసారి చెట్లపైకి యెక్కి పక్షి గూళ్లను పీకి పారేసి వాటిల్లో ఉన్న గుడ్లను నలిపివేసేవాడు. ఎప్పుడూ యెవరో ఒకరికి హాని చేస్తూనే ఉండేవాడు. వాడంటే అందరికీ, చచ్చేటంత భయం. వాళ్ల అమ్మ కూడా, వాణ్ణి 'రాక్షసుడు' అనేది. వాడి జేబులలో యెప్పుడూ వింత వింత వస్తువులు ఉండేవి. రకరకాల గుడ్లూ, పందికొక్కులూ కూడా వాడి జేబులలో ఉండేవి.



బోధిరాజుకు యెవరితోనైనా పోట్లాటవస్తే పోట్లగిత్తలా వాళ్లమీదికి దూసుకుపోయేవాడు. బడి అయిపోగానే మేమందరం ఇళ్లకి వెళ్లిపోయేవాళ్లం; వాడు మాత్రం యెటో తిరగటానికి పోయేవాడు. బోధిరాజు మాకు వింత వింత కథలు చెప్పేవాడు. ఒకసారి వాడు 'మా ఇంట్లో మెట్లకింద ఉడుము ఉంది. ఉడుము అంటే యేమిటో మీకు తెలుసా?' అన్నాడు.

'తెలీదు. ఉడుము అంటే యేమిటి?' అని అడిగాం మేము.

"అది పాకే జంతువు. ఒక అడుగు పొడుగు ఉంటుంది. దానికి చాలా గోళ్లుంటాయి" అని చెప్పాడు.

మేమందరం భయంతో ఒణికిపోయాం.

'ఆ ఉడుము గనక దేన్నయినా పట్టుకుంటే చచ్చినా వదలదు" అన్నాడు.

మాకు భయం మరీ ఎక్కువ అయింది.

"దొంగలు ఉడుమును పెంచుతారు. పెద్ద పెద్ద గోడలు ఎక్కడానికి దాన్ని వాడతారు. దాని వెనక కాళ్ళకు తాడు కట్టి గోడపైకి విసురుతారు. అదిగోడను గట్టిగా పట్టుకుంటుంది. ఉడుముకు



కట్టిన తాడు పట్టుకుని దొంగలు గోడలు ఎక్కుతారు"

"ఉడుము తన పట్టును ఎప్పుడు వదులు చేస్తుంది ?"

"గోడ ఎక్కిన తరవాత దొంగలు ఉడుముకు పాలుపోస్తారు. పాలు తాగడానికి అది గోడ మీద తన పట్టును వదిలి వేస్తుంది" ఇలా బోధిరాజు మాకు ఎన్నో సంగతులు చెప్పేవాడు.

మా నాన్నగారికి ప్రమోషన్ రావడం వల్ల మేం పెద్ద ఇంట్లోకి మారాము. మా ఇల్లు పాతకాలపు కట్టడం. అది ఊరి చివర ఉండేది. ఇంటిచుట్టూ పెద్ద తోట ఉండేది. తోటంతా చెట్లతో, పొదులతో నిండి ఉండేది. ఊరికి దూరం కావటం వల్ల మా ఇంటికి నా స్నేహితులు ఎవరూ వచ్చేవారు కాదు. ఆ ఇల్లు మాకెవరికీ పెద్దగా నచ్చలేదు.

బోధిరాజుకు మాత్రం మా ఇల్లు బాగా నచ్చింది. తను వేటాడటానికి మంచి తావు దొరికిందని మురిసిపోయాడు. చెట్లమీద బోలెడన్ని పిట్టగూళ్లు ఉండేవి. కొమ్మల మీద ఎప్పుడూ కోతులు తిరుగుతూ ఉండేవి. మా ఇంటి వెనకాల ఒక పెద్ద గది ఉండేది. మా అమ్మ ఆ గదినిండా పాత సామాను పెట్టింది. ఆ గది పావురాలకు నిలయమై పోయింది. పావురాల కూతలు మాకు రోజంతా వినిపిస్తూనే ఉండేవి. ఆ గది వెంటిలేటరు అద్దం పగిలిపోయింది. వెంటిలేటరు పక్కనే ఒక మైనా పక్షుల జంట గూడు కట్టుకుంది. గది అంతా పక్షి ఈకలతో, రెట్టలతో నిండి ఉండేది.

బోధిరాజు మా ఇంటికి రావడం అమ్మకు ఇష్టం ఉండేదికాదు. అయితే, నాతో ఆడుకోవటానికి ఎవరూ లేరని బోధిరాజును రానిచ్చేది. బోధిరాజును 'దయ్యపు వెధవ' అని అమ్మ తిట్టేది. పక్షులను బాదించవద్దని ఎన్నోసార్లు చెప్పింది. ఒకనాడు అమ్మ నాతో "నీ స్నేహితుడికి పక్షుల గూళ్లు పాడుచేయటం అంటే సరదాకదా! మన సామాను గదిని శుభ్రం చేయమను. పక్షులు ఆ గది అంతా ఆక్రమించి

పాడుచేస్తున్నాయి" అంది.

నేను ఒప్పుకోలేదు. "నువ్వే అంటావు కదా! పక్షుల్ని చంపడం పాపం అని" అన్నాను అమ్మతో.


"పక్షులను చంపమని నిన్ను వాడికి చెప్పమనటం లేదు. గూళ్లను ఆ గదిలోనుంచి తీసేయమని చెప్పమంటున్నాను. గూళ్లు తీసేస్తే పక్షులు అవే పోతాయి" అంది అమ్మ.

మరునాడు బోధిరాజు వచ్చినప్పుడు వాణ్ని నేను సామాను గదిలోకి తీసుకువెళ్ళాను.

వేలాడుతున్నాయి. కొన్ని పావురాలు దూలం మీద అటూ ఇటూ నడుస్తూ ఒక దాన్ని ఒకటి పలకరించుకుంటున్నాయి.

"అదుగో! మైనా పిల్లలు అక్కడ పైన ఉన్నాయి" అంటూ బోధిరాజు గుల్లేరును అటువేపు గురిచేశాడు.

గూటిలోనుంచి బయటకు పొడుచుకు వచ్చిన రెండు చిన్న పసుపుపచ్చ ముక్కులు నాకు కనిపించాయి.



బోధిరాజు, పక్షుల్ని పట్టుకొని వాటి రెక్కలు పీకేసి, కాళ్ళు విరిచేస్తాడేమోనని నాకు భయంగా ఉంది. గుడ్లు దొరికితే వాడు వాటిని పగలగొట్టందే ఊరుకోడని నాకు ముందే తెలుసు. అమ్మ వాడికి ఈ పని ఎందుకు చెప్పిందో నాకు అర్థం కాలేదు.

బోధిరాజు చేతిలో గుల్లేరు ఉంది. వాడు గదిని, గదిలో పక్షి గూళ్ళు ఉన్న చోటుని జాగ్రత్తగా పరిశీలించాడు. గది చూరు మధ్య రెండువైపులా గోడలను తాకుతూ ఒక పెద్ద దూలం ఉంది. దూలానికి ఒక చివర వెంటిలేటర్ ఉన్నవేపు మైనా పక్షుల గూడు ఉంది. దారాలు, గుడ్డ పేలికలు గూటినుంచి బయటకు

"వాటి తల్లిదండ్రులు ఎక్కడ" బోధిరాజు అడిగాడు.

"ఆహారం కోసం బయటికి వెళ్ళి ఉంటాయి. ఎప్పుడయినా అవి రావచ్చు" అన్నాను. బోధిరాజు గుల్లేరు గురి సరిగ్గా ఉందో లేదో చూసుకుంటున్నాడు.


నేను వాణ్ణి వారిద్దామనుకునేలోపునే వాడు వదిలిన రాయి వెళ్ళి గది కప్పుగా ఉన్న రేకులను తాకింది.

వెంటనే మైనా పిల్లలు గూటిలో వెనక్కి వెళ్ళిపోయాయి. బోధిరాజు ఇంకో రాయి

వదిలాడు. అది వెళ్ళి దూలానికి తగిలింది. రెండుసార్లు గురి తప్పడంతో వాడికి కోపం వచ్చింది. మూడోసారి సరిగ్గా గురిచూసి వదిలాడు. రాయి వెళ్ళి పక్షి గూటికి తగిలింది. రెండు గడ్డి పరకలు, దారం ముక్కలు కింద పడ్డాయి. గూడు మటుకు కింద పడలేదు. బోధిరాజు మళ్లీ గుల్లేరు పైకి ఎత్తాడు. గది అంతా ఒక్కసారిగా చీకటి అయిపోయింది. మేమిద్దరం ఆశ్చర్యంతో వెంటిలేటర్‌వైపు చూశాం. రెక్కలు విప్పుకుని భయంకరంగా చూస్తూ వెంటిలేటరు మీద కూచున్న ఒక డేగ మాకు కనబడింది.

"ఇది డేగ గూడు అనుకుంటాను" అన్నాను నేను.

"డేగలు ఇళ్ళలో గూళ్ళు పెట్టవు. చెట్లమీద కట్టుకుంటాయి. ఇది మైనా పక్షి గూడే. సందేహం లేదు" అన్నాడు బోధిరాజు. మైనా పిల్లలు రెక్కలు టపటపా కొట్టుకుంటూ, ముక్కులు బయటపెట్టి అరవసాగాయి. మాకు నోట మాట రాలేదు. డేగ ఏం చేస్తుందా అని నోరు వెళ్లబెట్టుకుని అటే చూస్తున్నాం. డేగ వెంటిలేటరులోనుంచి ఇవతలికి వచ్చి దూలం మీద వాలింది. రెక్కలు ముడుచుకొని కత్తిలా ఉన్న ముక్కును అటూ ఇటూ కదిలించింది. భయంతో కూడిన పక్షుల అరుపులతో గదినిండి పోయింది. "డేగ ఈ గదిలోకి రోజూ వస్తోంది" అన్నాడు బోధిరాజు. డేగ తరుచుగా ఆ గదిలోకి



వస్తోందని, పక్షులను తినేస్తోందని నాకు అర్థమయింది. బోధిరాజు డేగ మీదనుంచి తన కళ్ళు తిప్పలేదు. డేగ మెల్లగా పక్షి గూడువైపు జరుగుతోంది. పక్షుల అరుపులు మరీ ఎక్కవ య్యాయి. నాకు మాత్రం డేగకూ, బోధిరాజుకూ పెద్ద తేడా కనిపించలేదు. డేగ రాకపోతే బోధిరాజు ఆ పక్షి పిల్లలను తప్పకుండా చంపి ఉండేవాడు. బోధిరాజు తన గుల్లేరును డేగవైపు గురిపెట్టాడు.

"డేగను కొట్టకు. అది మనమీద పడుతుంది" అని అరిచాను. బోధిరాజు నా మాటను లెక్క చెయ్యలేదు. వాడు వదిలిన రాయి డేగ పక్కనుంచి పోయి చూరుకు తగిలింది. డేగ తన రెక్కలు విప్పి మావేపు చూసింది.

"పారిపోదాం" అన్నాను నేను భయంతో.

"ఈ డేగ పక్షి పిల్లలను తినేస్తుంది" అన్నాడు బోధిరాజు.

వాడి మాటలు నాకు వింతగా అనిపించాయి.

బోధిరాజు గుల్లేరును, రాళ్ళను నాకు ఇచ్చాడు. "డేగను కొడుతూ ఉండు. దానిని గూటివైపు రానియ్యకు" అన్నాడు. తరవాత గోడకు ఆనించి ఉన్న ఒక బల్లను లాక్కొచ్చి గది మధ్యలో వేశాడు.

నాకు గుల్లేరు ఉపయోగించడం రాదు. ఒకసారి గురిచూసి వదిలాను. డేగ ఆ దూలం మీదినుంచి ఇంకో దూలం మీదికి పోయింది.

బోధిరాజు బల్లను మైనా పక్షి గూడు కిందికి లాక్కొచ్చాడు. తరవాత విరిగిన కుర్చీ తీసుకువచ్చి బల్ల మీద వేశాడు. తను కుర్చీ మీదకు ఎక్కి జాగ్రత్తగా పక్షి గూడును దూలం నుంచి తీశాడు. దాన్ని చేతులో పట్టుకుని మెల్లిగా కిందికి దిగాడు.

"బయటకు పోదాం రా" అంటూ తలుపువైపు పరిగెత్తాడు. ఇద్దరం గేరేజిలోకి వెళ్లాం. ఒక దూలం అటూ, ఇటూ గోడల్ని కలుపుతూ అడ్డంగా ఉంది.

"డేగ ఇక్కడికి రాలేదు." అంటూ ఒక కుర్చీ ఎక్కి బోధిరాజు పక్షి గూటిని దూలం మీద పదిలంగా పెట్టాడు.

మైనా పిల్లల్లో కొంత భయం తగ్గింది. కుర్చీ మీద నించొని బోధిరాజు గూటిలోకి తొంగి చూశాడు. ఆ పిల్లల్ని గూటిలోంచి తీసి జేబులో వేసుకుంటున్నాడేమో అనుకున్నాను. బోధిరాజు వాటివైపు చూస్తూ ఆలోచిస్తూ చాలాసేపు అలాగే ఉండిపోయాడు. తరవాత నావైపు తిరిగి "కాసిని నీళ్ళు తీసుకురా. పాపం! వీటికి దాహంతో నోరు ఎండుకుపోయింది. ఒక్కొక్క చుక్క నీటిలో పోస్తే దాహం తీరుతుంది" అన్నాడు జాలిపడుతూ.

నేను పరిగెత్తుకెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చాను. బోధిరాజు నా చేతిలోని గ్లాసు అందుకుని దాంట్లో వేలు ముంచి చుక్కలు, చుక్కలుగా నీళ్ళు, తెరచివున్న వాటి నోట్లో పోశాడు. వాటిని ముట్టుకోవద్దని నాకు చెప్పాడు. తనూ వాటిని ముట్టుకోలేదు.


"అవి ఇక్కడ ఉన్నాయని వాటి తల్లిదండ్రులకు ఎలా తెలుస్తుంది?" అన్నాను.

"అవి వెతుక్కుని తెలుసుకుంటాయి. ఫరవాలేదు" అన్నాడు.

మేం చాలాసేపు గేరేజిలోనే ఉండిపోయాం. "సామానుగది వెంటిలేటర్‌ను బాగుచేస్తే, డేగ ఇక ఆ గదిలోని పక్షుల జోలికి రాదు" అన్నాడు బోధిరాజు.

మర్నాడు మా ఇంటికి వచ్చిన బోధిరాజు చేతిలో గుల్లేరు లేదు. జేబులో రాళ్ళు లేవు. వాడు ఒక సంచీనిండా గింజలు తీసుకొచ్చాడు. మేం ఆ గింజల్ని మైనా పిల్లల నోటికి అందించాం. ముద్దొచ్చే వాటి కదలికలు చూస్తూ రోజంతా వాడూ నేనూ అక్కడే గడిపాం. బోధిరాజులో వచ్చిన ఈ పరివర్తన మా అందరికీ చాలా ఆశ్చర్యం కలిగించింది. బోధిరాజు మారిపోయాడు. బుద్ధిమంతుడైనాడు. మంచివాడైనాడు.

– శిష్మసహాని






# బెలూన్ మేళ



నవంబర్ 11. హైదరాబాద్‌లో ఆకాశమంతా రంగురంగుల బెలూన్లతో నిండి అందంగా అగుపించింది. బ్రహ్మాండమైన సైజులో ఉన్న 15 గాలి గుమ్మటాల (హాట్ ఎయిర్‌బెలూన్ల)తో పాటు వేలాది చిన్నసైజు బెలూన్లు వినీలాకాశంలో విహరించాయి.

ఈ బెలూన్లు గట్టి నైలాన్‌తో తయారు చేస్తారు. ఒక్కొక్క బెలూన్ 100 అడుగుల ఎత్తుతో ఉంటుంది. దీని చుట్టుకొలత సుమారు 17 మీటర్లు ఉంటుంది. దీని ఎత్తు 24 మీటర్లు ఉంటుంది. ఇది చాలా తేలికగా ఉన్నప్పటికీ బలంగా ఉంటుంది. ఈ బెలూన్‌లో 77వేల క్యూబిక్ ఫీట్ల గాలిని నింపుతారు. ప్రతీ బెలూన్‌కు చోదకులను తీసుకెళ్ళడానికి బుట్ట (బాస్కెట్) ఉంటుంది. ఇద్దరు లేదా ముగ్గురు అందులో గగన విహారం చేసే వీలుంటుంది. ఆకాశంలో బెలూన్ ఎత్తుగా ఎగిరేందుకు మొదట ప్రత్యేకంగా తయారుచేసిన రెండు 5 హెచ్.పి. పంకాలతో గాలిని నింపిన తర్వాత 3 ఎల్.పి.జి. గ్యాస్ బర్నర్‌లతో బెలూన్ లోపలి గాలిని వేడిచేస్తారు. ఈ విధంగా వేడి గాలితో నిండిన బెలూన్ ఆకాశంలో ఎగురుతుంది. బెలూన్ ఇంకా ఎత్తుగా వెళ్ళాలంటే బర్నర్‌లను ఎక్కువ చేయడం ద్వారాను, క్రిందికి దిగాలంటే బర్నర్‌లను ఆపేయడం ద్వారానూ బెలూన్‌ను విహరింప చేయవచ్చు. ఆకాశంలో చోదకులు బెలూన్లతో సాధారణంగా 60 నుండి 160 మీటర్ల ఎత్తు వరకు వెళ్తారు. ఒకసారి 12,000 మీటర్ల ఎత్తు వరకు కూడా వెళ్ళినట్లు రికార్డు ఉంది. ఈ బెలూన్లు గంటకు 5 కిలోమీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణిస్తాయి. బెలూన్ మేళా-'90 లో విదేశాల నుంచి 15 బెలూన్లు పాల్గొన్నాయి. ఈ బెలూన్ల మధ్య వివిధ రకాలు పోటీలు పెట్టారు.







# పాప తెలివి

రచన : చొక్కాపు వెంకట రమణ

బొమ్మలు : టి. గంగాధర్






DELICIOUS AGRA AND BENGALI SWEETS FROM




manikonda
Jyothirmayee Complex, Opp. Venkatesha Theatre, Narayanguda, Hyderabad-29 Tel: 6237T

# జ్ఞానపదం





ఎంత చిత్ర మీ ప్రకృతి
ఎన్ని అద్భుతాలు,
మీకిది ఒక మాయలాగ
ఉన్నది కాబోలు!
ఎలా వెలుగుతారో కద
చంద్రుడు సూరీడు,
ఎక్కడ నేర్చాడో, గూటి
అల్లిక సాలీడు!





సీతా కోకలికి ఎవరు
అద్దారో రంగులు,
ఎలా ఉబికి వస్తాయో
నదులకి ఈ పొంగులు!
ఎలా అవతరించినట్టు
హిమాలయపు కొండలు,
ఒంటిమీద యెలా పెరుగు
తాయో కద కండలు !






ఎందుకిలా పెరిగి తరుగు
తుంది టెంపరేచరు,
అది చెప్పేటందుకె కద
వుంది సైన్సు టీచరు!
ప్రశ్నలలోనే వుందోయ్
ప్రకృతి విజ్ఞానం,
అడిగి తెలుసుకోవాలోయ్,
పనికిరాదు మౌనం !

దేవిప్రియ అంకుల్

# పిల్లల పే(చి)జి




మీరూ బొమ్మ గీయండి !

ఇక్కడ ఇచ్చిన విధంగా గీస్తే కుక్క బొమ్మను మీరు అతిసులువుగా వెయ్యొచ్చు ప్రయత్నించండి మరి!


చక్రవ్యూహంలోకి వెళ్ళి బయటికి రాగలరేమో ప్రయత్నించండి.

బయటికి దారి




లోపలికి దారి

కిట్టూ 'జూ'కు వెళ్ళి అక్కడ బంతితో ఆడుతుంటే అదికాస్తా పొదలో పడింది. ఎంత వెదికినా దొరకలేదు. చివరికి బంతి దొరకడంలో ఏది సహాయపడిందో చుక్కలు కలిపి కనుక్కోండి.




ఇక్కడున్న 'మాస్క్'లలో దేనిముక్కు పెద్దదిగా ఉందో? దేనిముక్కు చిన్నదిగా ఉందో చెప్పుకోండి చూద్దాం!



జవాబులు: మూడవమాస్క్ ముక్కు పెద్దదిగా, తొమ్మిదవ మాస్క్ ముక్కు చిన్నదిగా ఉన్నాయి.



స్కూలుకు వెళ్తూ దారిలో పోస్టాఫీసులోకి వెళ్ళి-

గాయత్రి :- పది ఇన్‌లాండ్ కవర్లకి, ఇరవై కార్డులకి ఎంతవుతుందండి?

పోస్టల్ క్లర్క్ :పదిన్నర అవుతుందమ్మా! ఇవిగో కవర్లు, కార్డులు.

గాయత్రి : అబ్బే వద్దండి. అది నా హోంవర్కు లెక్క!

---

యజమాని : రామయ్యా నాకు కాళ్ళు నొప్పిగా ఉన్నాయి. కాస్త కాళ్ళు నొక్కు.

నౌకరు : అలాగేనయ్యా!

రెండురోజుల తర్వాత యజమాని గొంతునొప్పితో బాధపడుతూంటే చూసిన

రామయ్య : అయ్యా! మీకు గొంతునొప్పిగా ఉన్నట్లుంది. గొంతునొక్కాలా...?

యజమాని : ఆ ! ...

---

టీచర్ : రాజూ! సూర్యుడు రోజూ ఉదయించకుంటే ఏమౌతుంది?

రాజు : కరెంటు బిల్లు పెరిగిపోతుందండీ!

---

టీచర్ చందూతో..

"నీకు చదువు చెప్పలేక చస్తున్నా. నీకు మాత్రం చదువు రావటం లేదు. నీకు చెప్పి చెప్పి నాకు పిచ్చెక్కుతూంది. నేను తొందరగా మీనాన్నగారిని కలవాలి."

చందు : అలాగే టీచర్. మా నాన్న సైకియాట్రిస్ట్.

---

రోగి : డాక్టర్ గారూ! నాకు ఒక్కరు ఇద్దరుగా కనిపిస్తున్నారండీ!

డాక్టర్ : ముందు కూర్చోండి. తర్వాత...

రోగి : ఇంతకు మీ ఇద్దరిలో డాక్టర్ ఎవరండీ?

---

సునిల్ : అనిల్, నేను నీకు ఒక వస్తువు 50 పైసలకు అమ్ముతా. అది నేను ఒక రూపాయికి కొన్నాను. అయినా నాకు లాభమే ఉంటుంది.

అనిల్ : యాభైపైసలు చేతిలో పట్టుకుని ఆశతో.. "సరే ఏమిటది?"

సునిల్ : నేను ఇంతకు ముందు బస్‌లో వచ్చిన బస్ టికెట్.

---

టీచర్ : శేషూ తొమ్మిది తర్వాత ఏమొస్తుంది?

శేషు : టెలిస్కూలండీ!

---

టీచర్ : శ్యాం! లెక్కల్లో నీకు ఎనభై మార్కులు ఇవ్వగలిగినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది.

శ్యాం: నూటికి నూరు వేసి ఇంకా గొప్ప ఆనందం పొందకూడదా సార్!

---

రాజు : "అంత పెద్దగా, గట్టిగా అరుస్తూ ఉత్తరం రాస్తున్నావేమిరా కాగితానికో అక్షరం చొప్పున?"

ప్రకాష్ : "ఏం చెయ్యమంటావ్? మా బామ్మకి బ్రహ్మ చెముడు మరి".



# జనరల్ నాలెడ్జ్

1. ఒక మంటపై భాగము వద్ద అదే దూరంలో పక్కలకన్నా వేడిగా ఉంటుంది దీనికి కారణం:
(a) ఉష్ణ వాహకత్వము (b) ఉష్ణ సంవాహనము
(c) ఉష్ణ వికిరణము
(d) ఉష్ణ వాహకత్వము, సంవాహనము, వికిరణము

2. ఒక కట్టె దిమ్మను నిలువుగా లేపుటకంటే ఒక వాలు తలము వెంబడి మీదికి లాగడము సులభము. దీనికి కారణము.
(a) ఘర్షణ తగ్గుతుంది గనుక
(b) ద్రవ్యరాశి తగ్గుతుంది గనుక
(c) బరువుకు కొంత భాగము మాత్రమే అతిక్రమించాలి గనుక
(d) 'G' తగ్గుతుంది గనుక

3. అన్నిరకాల ఉక్కులోనూ ఇవి ఉంటాయి.
(a) క్రోమియమ్, వెనేడియమ్ (b) నికెల్ కోబాల్ట్
(c) నికెల్, క్రోమియమ్, (d) కార్బన్, ఐరన్

4. దిగువనున్న మూలకాలలో ఏది ఆక్సిజన్‌తో చర్య జరులదు ?
(a) హీలియమ్ (b) సిలికాన్
(c) కార్బన్ (d) నైట్రోజన్

5. 36890 లో 3 యొక్క స్థాన విలువకు సహజ విలువకు గల తేదా ?
(a) 0000 (b) 29997
(c) 30003 (d) 6890

6. ఒక కి.మీ. పొడవుగల రైలుబండి 3 నిమిషములకు ఒక కి.మీ. వేగముతో ప్రయాణము చేయుచున్నది. 2 కి.మీ. పొడవుగల సొరంగమును దాటుటకు ఆ రైలుబండికి పట్టుకాలము.
(a) 1 నిముషము (b) 3 నిముషములు
(c) 6 నిముషములు (d) 9 నిముషములు

7 భారత దేశములో ప్రధాన ధాన్యపు పంట
(a) గోధుమ (b) వరి
(c) మొక్కజొన్న (d) జొన్న

8. దీనివల్ల క్షయరోగం వస్తుంది.
(a) ఒక రకమైన బాక్టీరియా (b) వైరస్
(c) ప్రొటోజోవా (d) కుపోషణ

9. ఈస్టిండియా కంపెనీ పరిపాలనతో స్థాపించబడిన తొలి కళాశాల ఏది ?
(a) ఆగ్రా కాలేజ్, ఆగ్రా
(b) హిందూ కళాశాల, కలకత్తా
(c) ఢిల్లీ కాలేజ్, ఢిల్లీ
(d) ఆంగ్లో - ఒరియంటల్ కాలేజ్, అలీగఢ్

10. యూరప్‌లో మొదటిసారిగాపారిశ్రామిక విప్లవము ప్రారంభమైన దేశము.
(a) ఫ్రాన్స్ (b) ఇంగ్లాండ్
(c) జర్మనీ (d) ఇటలీ

11. దండకారణ్యమున్నది ఈ భారతదేశ భాగంలో
(a) ఉత్తర (b) మధ్య (c) ఈశాన్య (d) దక్షిణ


12. అర్థరాత్రి సూర్యుడు కన్పించే ప్రదేశము
(a) నార్వే (b) జపాన్
(c) హాలెండ్ (d) ఐస్‌లాండ్


13. భారత రాజ్యాంగము అమలులోకి వచ్చిన తేది ?
(a) ఆగష్టు 9, 1942 (b) ఆగష్టు 15, 1947
(c) నవంబర్ 26, 1949 (d) జనవరి 26, 1950

14. పురుషులతో సమానంగా స్త్రీలకు ఓటు హక్కు లభించినది క్రిందివానిలో ఏ సూత్రం దీనికి ఆధారము
(a) సామాజిక సమానత్వము
(b) నాగరిక సమానత్వము
(c) నైతిక సమానత్వము
(d) రాజకీయ సమానత్వము

15. ప్రభుత్వము ఈ క్రింది విస్తరణకు ప్రాముఖ్యము నొసంగినచో గ్రామ ప్రాంతములలో నిరుద్యోగమును తగ్గించవచ్చును.
(a) విద్య
(b) భూమిలేని వారికి భూమి పంపకము
(c) గ్రామ, కుటీర పరిశ్రమాభివృద్ధి
(d) ఏర్పాటు చేయబడిన ప్రాజెక్టులు అమలు చేయుట

16. ఉన్నవారికి, లేనివారికి మధ్య పెరుగుతున్న భేదాన్ని తగ్గించే ఆర్థిక వ్యవస్థ
(a) పెట్టుబడిదారీ విధానము (b) సామ్యవాదము
(c) సమాజవాదము
(d) మిశ్రమ ఆర్థిక విధానము

17


18


**జవాబులు**

1) b 2) d 3) d 4) a 5) b 6) d 7) b 8) a 9) b 10) b 11) b 12) a 13) d 14) a
15) c 16) c 17) b 18) a

GO COOL
ICE CREAM

బాల చెలిమి
పిల్లల సమాచార పత్రిక

If you are a Student preparing for
EAMCET - 91
SREE VIDYADHARI
POSTAL CLASSES
1-1-80/A to G, II Floor
RTC 'X' Roads, Hyd - 20.

సంపుటి 1 : సంచిక 12
డిశంబర్ 1990

## మారుతీవ్యాను నడిపిన నాలుగేళ్ళ బాలుడు

'కృషి, పట్టుదల ఉంటే సాధించ లేనిది ఏదీ లేదు' అని నాలుగు సంవత్సరాల దినేష్ అనిల్ రాజని (భజరంగ్) నిరూపించాడు. ఈ పసివాడు నాలుగేళ్ళ వయస్సులోనే మారుతీ వ్యానును నగరంలోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లైనులో నవంబర్ 27న నలభై కిలో మీటర్ల వేగంతో అతి సునాయాసంగా నడిపించి అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేశాడు. వ్యానులోని ఏక్సిలేటర్, బ్రేక్ లాంటి పరికరాలు బాలుడికి అందే విధంగా అమర్చారు. భజరంగ్ ఇప్పుడు



హైదరాబాద్‌లోని సెయింట్ పాల్స్ హైస్కూలులో నర్సరీ చదువుతున్నాడు. ఈ విషయాన్ని 'గిన్నిస్ బుక్' దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు భజరంగ్ తల్లిదండ్రులు తెలిపారు.

## ఉత్తమ విద్యార్థినికి జాతీయ అవార్డు

1990ని సార్క్ బాలికల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా బాలికల స్థితిగతు లను తెలుసుకుని అన్ని రంగాల్లోనూ ప్రోత్సాహం అందించి బాలికల అభివృద్ధికి కృషి చెయ్యాలనే సంకల్పంలో భాగంగా విద్యారంగంలో అత్యుత్తమ ప్రతిభ చూపే బాలికలకు జాతీయ అవార్డులు ఇచ్చే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తూంది.

ఒకస్థాయి వరకు విద్యను కొనసాగించేలా బాలికలను చైతన్యవంతం చేయడమే ఈ పథకం ఉద్దేశం. ఈ పథకం కింద దేశంలోని ప్రతి జిల్లాలోని ఒక ఉత్తమ విద్యార్థినికి ఈ అవార్డు ఇస్తారు.

## ఇందిరాగాంధీ అవార్డు



ప్రముఖ గాయని శ్రీమతి M.S. సుబ్బలక్ష్మికి ఈ సంవత్సరపు 'ఇందిరా గాంధీ అవార్డు'ను ఇచ్చారు. జాతీయ సమైక్యత చిహ్నంగా న్యూఢిల్లీలోని తీన్ మూర్తి భవన్‌లో అక్టోబర్ 31న ఈ అవార్డును శ్రీ రాజీవ్ గాంధీ ఇచ్చారు. ఈ అవార్డు కింద 1 లక్ష రూపాయల బహుమానం శ్రీమతి సుబ్బలక్ష్మికి అందజేశారు.

## సాహస బాలునికి జాతీయ అవార్డు



చిన్న వయస్సులోనే ఆ బాలుడు ప్రదర్శించిన నవయువ స్ఫూర్తి అత్యంత ధైర్య సాహసాలతో కూడినది. ఇద్దరు పిల్లలు ఎనిమిది అడుగుల లోతు నీళ్ళుగల కాలువలో పడి మునిగిపోతూ ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితిలో పెద్దవాళ్ళు కూడా ఏమి చేయాలో అర్థం కానప్పుడు తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కాలువలో దూకి ఇద్దరు పిల్లల ప్రాణాలు రక్షించాడు వరంగల్‌కు చెందిన ఆకుల శ్రీకాంత్. ఈ బాలుని సాహసానికి మెచ్చి 1990 సంవత్సరానికి జాతీయస్థాయిలో ధైర్య సాహసాలు ప్రదర్శించిన వారికిచ్చే అవార్డుకు కేంద్రప్రభుత్వం ఎంపిక చేసింది. శ్రీకాంత్ ఇప్పుడు పదవ తరగతి చదువుతున్నాడు.






## మన నూతన ప్రధాని



భారతదేశపు 8వ ప్రధానిగా శ్రీ చంద్రశేఖర్ నవంబర్ 10న ప్రమాణ స్వీకారం చేశారు. ఇంతకుముందు ప్రధాని అయిన శ్రీ విశ్వనాథ ప్రతాప్ సింగ్‌కు సరియైన మద్దతులేని కారణంగా శ్రీ చంద్రశేఖర్ నూతన ప్రధాని అయ్యారు.

## నగరంలో క్రికెట్ మ్యాచ్

భారత పాకిస్తాన్‌ల మధ్య జరిగే ఆసియా కప్ టోర్నీ వన్‌డే క్రికెట్ మ్యాచ్ డిశంబర్ 31న హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో జరుగుతుంది. భారత పాకిస్తాన్ జట్లు గతంలో 1987 లో ఇక్కడ పోటీపడ్డాయి.

బాలచెలిమి
పిల్లల సమాచార పత్రిక

సంపుటి : 1 సంచిక : 12 డిశంబర్ 1990

## సంపాదకీయం

'చెలిమి' సమాచార పత్రిక మాకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తోటి మిత్రులు రాస్తున్న ఉత్తరాలు చదివి ఆనందించాం. మనలాంటి పిల్లలకు కూడా దేశ విదేశాల వార్తలు తెలిపేందుకే ఈ పత్రిక. వివిధ గ్రామాలనుండి, పట్టణాల నుండి బాలబాలికలు పంపిస్తున్న వార్తలు పరిశీలించి అందులో మనందరికీ ఉపయోగపడే వార్తలు ఇందులో ప్రచురించాం. ఇకముందు కూడా మీరంతా ఇలాగే సహకరించి పత్రికలో మరింత సమాచారం అందించేందుకు సహకరిస్తారని ఆశిస్తూ –

అజయ్ – విజయ్
(సంపాదకులు)




## చదరంగం ఛాంపియన్

కేరళలోని కాలికట్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన జాతీయ బాలికల సబ్ జూనియర్ చదరంగం ఛాంపియన్ షిప్ పోటీలలో రాష్ట్ర ప్రతినిధిగా తణుకుకు చెందిన కుమారి శైలజ పాల్గొని ప్రథమ స్థానాన్ని, ఛాంపియన్ షిప్‌ని గెల్చుకుంది. శైలజ తణుకు జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చదరంగలో సబ్ జూనియర్ బాలికల విభాగంలో జాతీయ స్థాయి వ్యక్తిగత ఛాంపియన్ షిప్ సాధించిన కుమారి శైలజ భారతదేశ ప్రతినిధిగా ఏషియన్ సబ్ జూనియర్ చదరంగం ఛాంపియన్‌షిప్ పోటీలలోనూ, ప్రపంచ చదరంగం సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీలలోనూ పాల్గొనబోతున్నది.

## వకార్ యూనిస్ రికార్డు



పాకిస్థాని ఫాస్ట్ బౌలర్ వకార్ యునిస్ కేవలం తన 10వ టెస్ట్ మ్యాచ్‌లోనే 50వ టెస్ట్ వికెట్‌ను సాధించి పాకిస్తాన్‌కు కొత్త రికార్డ్ నెలకొల్పాడు. వెస్టిండీస్ మొదటి ఇన్నింగ్స్‌లో కీపర్ మెయిన్‌ఖాన్ కార్లిస్లీ బెస్ట్‌ను క్యాచ్ పట్టి ఓట్ చేయడంతో యేనిస్‌కు ఈ ఘనత దక్కింది. 20 ఏళ్ళ క్రితం ఖాన్ మహమ్మద్ తన 11వ టెస్ట్‌లో 50వ టెస్ట్ వికెట్‌ను పడగొట్టిన రికార్డ్ బద్దలైంది.



## జపాన్ చక్రవర్తిగా అకిహితో

జపాన్ నూతన చక్రవర్తిగా అఖిహితో నవంబర్ 8న పట్టాభిషిక్తులయ్యారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి 158 దేశాల నుండి రాజులు, రాణులు, అధ్యక్షులు, ప్రధానులు, షేక్‌లు, ప్రపంచ సంస్థల నేతలు హాజరై కొత్త చక్రవర్తికి శుభాకాంక్షలు అందజేశారు. చక్రవర్తి అకిహితో 2400 సంవత్సరాల చరిత్ర కలిగిన విశాల చేమంతి సింహాసనాన్ని అధిష్టిస్తున్నప్పుడు గౌరవ సూచకంగా ప్రపంచ నాయకులంతా శిరస్సులు వంచి అభినందన చేశారు. చక్రవర్తి సతీమణి మహారాణి మిచికో ఆయన సరసనే ఆశీనురాలైంది.

" బిడ్డకు మొదట విధేయత నేర్పండి. ఆ తర్వాతే మిగిలిన వన్నీ – బెంజమిన్ ఫ్రాంక్లిన్

"పరుషమైన మాటలు పిల్లల మనస్సుల్ని విపరీతంగా గాయపరుస్తాయి" – లాంగ్‌ఫెలో

## పేరుమారుతున్న సోవియట్ యూనియన్

సోవియట్ యూనియన్ పేరు మారుతోంది. యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్ (U.S.S.R) లోని సోవియట్, సోషలిస్ట్ పదాలు తొలగించి, యూనియన్ ఆఫ్ సావరిన్ రిపబ్లిక్‌గా మారుస్తున్నట్లు జపాన్ వార్తా సంస్థ పేర్కొంది.



## హవాయిలో గాంధీ విగ్రహం


హవాయి దేశ రాజధాని హనోలులూ నగరంలో ప్రసిద్ధ యాత్రాస్థలం క్వీన్స్ పార్క్ ప్రవేశ ద్వారం దగ్గరలో గాంధీ మహాత్ముని విగ్రహం స్థాపించారు. ఎనిమిది అడుగుల ఈ కాంస్య ప్రతిమను నగర మేయర్ ఫ్రాంకోఫాసి ఆవిష్కరించారు. సోదరప్రేమ భావన స్ఫురింపజేసే అద్భుత శక్తి గాంధీ రూపంలో భూమి మీద అవతరించిందని మేయర్ చెప్పారు.

## పాకెట్ కార్టూన్





తీరిక వేళల్లో...
ఫోటో: జీవన్



చిత్రం: పి. గనదీప్‌రాయ్

# పద చదరంగం – 2

**ఆధారాలు : అడ్డం :**

2. ఒక ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి (4)
5. గెలవాడనికి చేసేయత్నాన్ని ఇంగ్లీష్‌లో ఇలా అంటాం. (3)
6. 'దులీప్ మెండిస్' పేరు పార్లకట్‌లో అట్నుంచి ఇటు. (3)
8. ఇది ఏడు నిలువే గాని చిన్న మార్పుతో అటునుండి ఇటు (2)
9. గవాస్కర్ కుడినుంచి ఎడమకు రన్స్ తీస్తే..? (4)
11. అతి తక్కువ వయసులో టెస్ట్ క్రికెట్ ఆడిన భారతీయుడు. (3)
13. పరుగుల రాణి ఉషకు ట్రైనింగిచ్చిగజిబిజి అయ్యిందీ యనే (4)
15. గజిబిజి అయిన కపిల్ దేవ్. (5)

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | | 3 | ■ | 4 |
| 5 | | | ■ | ■ | | ■ | |
| | ■ | ■ | 6 | 7 | | ■ | |
| | ■ | ■ | ■ | 8 | | ■ | |
| 9 | | 10 | | ■ | 11 | | |
| | ■ | | ■ | 12 | ■ | ■ | |
| | ■ | | ■ | 13 | 14 | | |
| ■ | 15 | | | | | ■ | |

**నిలువు :**

. రవిశాస్త్రి పూర్తిపేరు (7)
2 గవాస్కర్ ముద్దు పేరు. (2)
3 తిరగబడిన 'సలీం దురానీ'. (5)
4 చదరంగంలో మన 'గ్రాండ్ మాస్టర్' (8)
7 గెంతడాన్ని ఇంగ్లీష్‌లో ఇలా అంటారు. అయితే నాలుగేళ్ళకోసారిగాని గెంతలేమా? (2)
10 చేతులతో ఆడే ఓ బంతి ఆట. (4)
12 గజిబిజి అయిన లాన్ టెన్నిస్ ఆటగాడు 'బెకర్' (3)
14 పేరులో 'ద' మాయమైనా భాగ్యనగర్ క్రికెట్ ఆటగాడు. (2)

పై గడిలోని పదచదరంగాన్ని డిసెంబరు 25 లోగా నింపి పంపండి.

**రూ. 100/- గెల్చుకోండి.**

**బాలచెలిమి**
10, హిమాయత్ నగర్
హైదరాబాదు - 500 029.

**ఈసంచికపై మీ అభిప్రాయాలు రాయండి.**

☐ బాగుంది ☐ పరవాలేదు ☐ బాగాలేదు

మీ సూచనలు ______________________

______________________

ఈస్థలం సరిపోకుంటే తెల్లకాగితంపై రాయండి.

పేరు ______________________

చిరునామా ______________________

______________________

______________________

పిన్ : ______________

పదచదరంగం 1 సమాధానంతో సరిపోయే సమాధానం వ్రాసినవారు చాలామంది ఉండటం చేత లాటరీ పద్ధతిలో 10 మందిని ఎంపిక చేయటం జరిగింది.

విజేతలు : (1) ఎం. శశిధర్, రాయదుర్గం (2) ఎ. ఉషా కిరణ్, చొప్పదండి (3) పి. సత్యనారాయణ రెడ్డి, నల్లగొండ (4) జి. హేమలత, రాజమండ్రి (5) వి. ఉషఃసంధ్య, విశాఖపట్టణం (6) కావ్య, గోదావరిఖని (7) జి. ప్రవీణ్, అనంతపురం (8) జమీల్ అహమద్, విజయవాడ (9) ఆకాశ్, వరంగల్ (10) జి.వి. రమణారెడ్డి, వాయల్పాడు. బహుమతి మొత్తం రూ. 100/- వీరికి సమానంగా అందచేస్తున్నాము.

## పదచదరంగం 1 – సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| నా | ■ | బా | ల | చె | లి | మి | ■ |
| గ | ది | ■ | ■ | ర | ■ | ర | వి |
| లి | ■ | స | నా | ప | పం | ప | ర |
| ■ | బా | ల | ల | కు | వి | కా | సం |
| మా | న | స | ■ | రా | చి | ■ | ■ |
| చ | ■ | ల | ■ | చె | ■ | ■ | ఫి |
| వ | బా | ■ | నే | డే | ఈ | నా | డే |
| రం | గు | ■ | త | వు | డు | ■ | లు |

# 19వ ఎక్కం సులభంగా రావడాన్కి చిట్కా

19 ఒకట్ల 19, 19 రెండ్లు 30 అంటూ పల్లెవేయడం, మధ్యలో రాకపోతే నట్టడం, అందరికీ మామూలే. కాని 19వ ఎక్కం అంటే అస్సలు భయపడే అవసరం లేదు. రెండు నిమిషాల్లో చకచకా 19వ ఎక్కం రాసేసి మీ స్నేహితులను ఆశ్చర్యంలో ముంచెత్తండి.

| | | | | |
|---|---|---|---|---|
| 19 | x | 1 | = | 19 |
| 19 | x | 2 | = | 38 |
| 19 | x | 3 | = | 57 |
| 19 | x | 4 | = | 76 |
| 19 | x | 5 | = | 95 |
| 19 | x | 6 | = | 114 |
| 19 | x | 7 | = | 133 |
| 19 | x | 8 | = | 152 |
| 19 | x | 9 | = | 171 |
| 19 | x | 10 | = | 190 |

19ని 1తో, 2తో, 3తో గుణిస్తూ పోతే వచ్చే మొత్తాలని గుణకఫలము అంటాము. ఈ గుణకఫలములో ఒకట్ల స్థానంలో వున్న అంకెలను వరుసగా వ్రాయండి. వాటి క్రమం ఇలా వుంటుంది. 9, 8, 7, 6, 5, 4, 3, 2, 1, 0.

గుణకఫలంలో మనకు ఒకట్ల స్థానంలో వున్న అంకెలు రావాలంటే ఇలా చెయ్యాలి. మనం చేస్తోంది 19వ ఎక్కం. 19 కి దగ్గరగా వుండి 10లో భాగింపబడే సంఖ్య 20 అని మీకు తెలుసు. అందుకని మనం 20ని తీసుకొందాం. ఈ 20ని భూమి అనాలి. ఈ భూమికి మనం బెట్టుకోబోయే ఎక్కం 19కి బేధం ఎంతో తెలుసుగా. ఆ ఖేదం '1'. దీన్ని ఫలం అంటాము.

పందొమ్మిదవ ఎక్కంలో (19), తొమ్మిదిని తీసుకొని దాన్ని ముందుగా ఒకట్ల స్థానంలో రాయాలి.

| | |
|---|---|
| ఈ 9 నుండి ఫలం ఒకటిని తీసేస్తే వచ్చేది | 8 (9 - 1) |
| 8లోనుండి ఫలాన్ని తీసేస్తే | 7 (8 - 1) |
| 7లోనుంచి పలాన్ని తీసేస్తే | 6 (7 - 1) |
| ఇలా పలాన్ని తీసేస్తూ పోతే | 5 (6 - 1) |
| | 4 (5 - 1) |
| | 3 (4 - 1) |
| | 2 (3 - 1) |
| | 1 (2 - 1) |
| | 0 (1 - 1) వస్తాయి. |


పందొమ్మిదవ ఎక్కంలో ఒకట్ల స్థానంలో వుండాల్సిన అంకెలన్నీ వచ్చాయి కదూ. ఇక పదుల స్థానంలో వుండే అంకెలను ఎలా రాబట్టాలో చూద్దాం.

మనం తీసుకున్న భూమి 20 అని మీకు జ్ఞాపకం ఉంది కదూ. ముందుగా ఒకట్ల స్థానంలో ఉన్న 9 ముందు (అంటే పదుల స్థానంలో) ఫలాన్ని వ్రాయాలి. అప్పుడు మనకు వచ్చే సంఖ్య

భూమిలో (20) పదుల స్థానంలో ఉన్న సంఖ్య -2. ఈ రెండుకు ఫలం - (1) ఒకటిని కలిపితే వచ్చేది - 3 (1+2). ఈ మూడును పదులస్థాణంలో వేయ్యాలి. తరువాత పదుల స్థానంలో వున్న సంఖ్యకు వరుసగా 2 కలుపుకొంటూ పోవాలి. అంతే 19వ ఎక్కం చక్కగా వచ్చేస్తుంది.

| | | | |
|---|---|---|---|
| | | | 19 |
| 1 | + | 2 | 38 |
| 3 | + | 2 | 57 |
| 5 | + | 2 | 76 |
| 7 | + | 2 | 95 |
| 9 | + | 2 | 114 |
| 11 | + | 2 | 133 |
| 13 | + | 2 | 152 |
| 15 | + | 2 | 171 |
| 17 | + | 2 | 190 |

పి. నరసింహారావు. లెక్చరర్


ఎర్రజెండా
వినూత్న
కిట్టూగాడు ఒసారి వాళ్ళ బాబాయ్‌తో కలిసి రైల్వే స్టేషన్‌కు వెళ్ళాడు.
అదేమిటి బాబాయ్ ఎర్ర జెండా ఊపుతున్నారు
ఎర్రజెండా ఊపితే రైలు ఆగుతుందిరా!
ఓహో! అలాగా... ఎరుపు రంగు ఆగడానికి గుర్తన్నమాట
అవును
ఒకరోజు కిట్టుగాడు బజారులో వెళ్తుంటే ఒక ఎద్దు పరుగెత్తుతూ వస్తోంది.
బాబోయ్
తప్పుకోండి!
అయ్యో
కిట్టూగాడికి వెంటనే ఆలోచన తట్టింది ఎర్రగుడ్డ తీసిదానికి ఎదురుగా పెట్టాడు
ఆగు!!
ఎర్రగుడ్డ చూసిమరీ రెచ్చిపోయి ఎద్దు కిట్టూగాడి వెంటపడింది.
ఒర్నాయనోయ్! ఈ వేళ నాపని సరి!
కిట్టూగాడు ఇంటికొచ్చి బాబాయ్‌ని నిలదీసి అడిగాడు
ఎరుపు ఆగడానికి గుర్తని అబద్ధం చెప్పావు. ఎద్దుకి చూపితే నన్ను పొడవడానికి వచ్చింది. నీవన్నీ అబద్ధాలే బాబాయ్!
ఒరే వెర్రినాన్న! ఎద్దుకి ఎర్రగుడ్డ చూపితే కోపంరా! పొడుస్తుంది! అది రైలు కాదుగా ఆగడానికి!
సమాప్తం!

# చెస్ మెరుపువీరుడు - విశ్వనాథన్ ఆనంద్



అతి చిన్న వయస్సులోనే ఆబాలుడు 'చెస్' సామ్రాజ్యానికి గ్రాండ్ మాస్టర్ అయ్యాడు. ప్రపంచంలో అందరికన్నా వేగంగా ఆలోచించి ఎత్తులు వేయగలవాడిగా పేరుపొందాడు. చిన్నతనమునే ప్రతిష్టాకరమైన పద్మశ్రీ, అర్జున అవార్డులు పొందాడు. 'ప్రపంచవిజేత'గా అయ్యేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాడు ఆబాలుడు. భారతదేశం గర్వించదగిన 'గ్రాండ్‌మాస్టర్'గా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఇరవై ఏళ్ళ ఆబాలుని పేరు 'విశ్వనాథన్ ఆనంద్'!

ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్ సాధించడానికి అపారమైన తెలివితేటలు, పట్టుదల, కృషి కావాలి. అతిరథ మహారథులను ఓడించి 'ప్రపంచ విజేత' కావడం ఎంతో కష్టం. ఇందుకు సుదీర్ఘమైన కాలం పడుతుంది.

మన విశ్వనాథ్ ఆనంద్ ఇంటర్‌పోటీల్లోనూ, కాండిడేట్స్ పోటీల్లోనూ గెలుపొందాడు. ఇందులో మరి ఆరుగురు ఎన్నికయ్యారు. ఈ పోటీల్లో ఏడుగురు విజేతలకు తోడు కాస్పరోవ్‌గాని కార్పొవ్ గానీ, జతకలుస్తారు. ఈ ఎనిమిది మంది 1991 మే - జూన్ నెలల్లో క్వార్టర్ ఫైనల్స్ ఆడతారు. సెమీఫైనల్స్ 1992 జనవరి - ఫిబ్రవరి నెలల్లో, ఫైనల్స్ 1992 మే - జూన్ నెలల్లో జరుగుతాయి. ఫైనల్లో గెలిచే ఆటగాడు ఛాలెంజర్ అవుతాడు. అతను ప్రపంచ విజేతను ఢీ కొంటాడు అది 1993 వరల్డ్ టైటిల్ పోటీ అవుతుంది.

1969 డిసెంబర్ 11న కే. విశ్వనాథన్, సుశీలలకు ముద్దుల బిడ్డగా పుట్టిన ఆనంద్ పసివయస్సులోనే తల్లివద్ద చదరంగం నేర్చుకున్నాడు. తండ్రి సదర్న్ రైల్వేలో పనిచేసేవాడు. ఆయన 1978లో డిప్యుటేషన్ మీద పిలిప్పైన్స్ వెళ్ళవలసి వచ్చింది. ఆయనతోపాటు వెళ్ళిన ఆనంద్ అక్కడ ఒక స్కూల్లో చేరాడు. దేశంకాని దేశంలో వేరే ఏమీ తోచక అతనూ, అతని తల్లి చదరంగం ఆడుతుండేవారు.

పిలిప్పైన్స్ వారికి చదరంగం అంటే భలే మోజు. ఆగాలి ఆనంద్‌కు సోకింది. చెస్‌లో ఆనంద్ ప్రావీణ్యం సంపాదించి అక్కడ అనేక బహుమతులు గెలుచుకున్నాడు. 1982లో తండ్రితో పాటు మద్రాస్‌కు తిరిగివచ్చి 1984లో గోవాలో జరిగిన జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్‌ను మొదటిసారిగా గెలుచుకున్నాడు. ఆ వెంటనే ఫ్రాన్స్‌లో జరిగిన వరల్డ్ సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని కాంశ్య పతకం సంపాదించాడు. వరల్డ్ జూనియర్ రేటింగ్స్‌లో పదోస్థానంలో నిలిచిన ఏకైక భారతీయుడు ఇప్పటికే ఇతనే! అలా ఒక్కో మెట్టు ఎక్కుతూ 'గ్రాండ్‌మాస్టర్' అయ్యాడు.

ఆనంద్ తన 14 ఏళ్ళవయస్సులో ఆసియా జూనియర్ టైటిల్‌ను, 16 ఏళ్ళ వయస్సులో భారత జూనియర్ ఛాంపియన్ షిప్‌ను, 17 ఏళ్ళ వయస్సులో ప్రపంచ

జూనియర్ ఛాంపియన్ షిప్‌ను గెల్చుకున్నాడు. 18 ఏళ్ళలో గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు. ఇంత చిన్న వయస్సులో ఈ హెూదా పొందిన ఆసియన్ ఇతను ఒక్కడే! ఈ సంచలన బాలుడు, మన 'గ్రాండ్‌మాస్టర్' త్వరలోనే ప్రపంచ విజేత కాగలడని ఆశిద్దాం!.

# ఆరోగ్య 'మంత్రం' మీ చేతుల్లో ఉంది!

ఆలోచన లేకుండా పెద్దలేమీ చెప్పరు. అందుకేనేమో వారన్న 'ఆరోగ్యమే మహాభాగ్యం' లో ఎంతో నిజం దాగి ఉంది. అయితే 'ఈ కలుషిత వాతావరణంలో ఆరోగ్యంగా ఉండటమెలా?' అని మీరు ప్రశ్నించవచ్చు. నిజమే. అలాంటి వాతావరణాన్ని తప్పించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో హాయిగా ఉండాలనుకోవడం అంత తేలిక కాదు. కాని అసంభవం మాత్రం కాదు సుమా! సంభవమే. అసలు మీకు తెలుసా ? దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుకోగల 'మంత్రం' మన చేతిలోనే ఉంది. నిజానికి ఆరోగ్యమనేది ఎవరో ఇస్తే వచ్చేది కాదు. ఆరోగ్యం, అనారోగ్యం అనేవి మన చేతుల్లోనే ఉన్నాయి. సంపూర్ణారోగ్యం పొందాలంటే మీరు చేయవలసిన మొదటి పని ఏమిటో తెలుసా? ఆహారం తేసుకునే విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఇంట్లో అమ్మ చేస్తుంది గనుక ఫర్వాలేదు. అంతా శుభ్రంగానే ఉంటుంది. కానీ మీ స్కూలు గేటువద్ద, బజార్లలో అమ్ముతారు చూశారూ! అక్కడే ఉంది అసలైన అనారోగ్య భూతం. ఆ అమ్మేవాళ్ళు ఏనాడూ శుభ్రత గురించి పట్టించుకోరు. వాళ్ళకు కావలసింది వారు తయారుచేసిన పదార్థాలు అమ్ముడు పోవడం. మధ్యలో దెబ్బతినేది ఎవరో తెలుసా ?..... మనమే. దుమ్మూ ధూళితో నిండి, ఈగలు ముసిరే ఆ పదార్థాలను తిని ఆస్పత్రి పాలయితే మీ అమ్మానాన్నలకు ఎంత బాధ, ఎంత విచారమో మీరు ఊహించారా ? అందుకే ఆహారం తీసుకునే విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి. అశుభ్రంగా కన్పించే ఆహారం జోలికి పోకుండా - ఇంట్లోనైనా సరే దూరంగా ఉండండి. ఎల్లప్పుడూ బలమైన ఆహారాన్నే తీసుకోవడానికి ప్రయత్నించండి. ఇంకో విషయం గుర్తుంచుకోండి! ఎంత తిన్నామన్నది ప్రధానం కాదు. ఏది తిన్నామన్నదే ప్రధానం.


ఆరోగ్యానికి మరో అత్యుత్తమ చిట్కా 'వ్యాయామం'. మంచి ఆరోగ్యానికి ఆహారం ఎంత ప్రధానమో వ్యాయామం కూడా అంతే ప్రధానం. అయితే టైసన్‌లా తయారైపోవాలని ప్రారంభం నుంచే పెద్ద పెద్ద బరువులు మోసేరు...... అది చాలా ప్రమాదం తొలుత చిన్న చిన్న ఎక్సర్‌సైజ్‌లు చేయండి అప్పటికూడా చేయాలనే ఉత్సాహం మీలో కలగకపోతే ఓసారి పొద్దున్నే లేచి స్టేడియంలోకి పోయి చూడండి. ఖచ్చితంగా మీలో నిద్ర ఎగిరిపోయి దాని స్థానే ఆసక్తి, ఉత్సాహం కలుగుతాయి. నిజానికి ఉత్తమమైన వ్యాయామం రన్నింగ్. పొద్దున్నే స్టేడియంలోనో లేదా ట్రాఫిక్‌లేని రోడ్లమీదో ఓ పావుగంట చెమట పట్టేలా రన్నింగ్ చెయ్యండి. "ఆలస్యం అమృతం విషం' అని పెద్దలు చెప్పారు కదా! ఇంకా ఆలోచిస్తారేమిటి? ఇవాళనుంచే వ్యాయామం చెయ్యడం ప్రారంభించండి. అనారోగ్యం మీ జోలికి రాదు. ఈ విషయం కూడా గుర్తుంచుకోండి. మీరు ఏ ఆటలోకి దిగాలనుకున్నా మొదట కాస్సేపు వ్యాయామం చెయ్యాలి. దాన్నే 'వామప్' (WARM-UP) అంటారు. అలా చేయకుంటే పూర్తి స్థాయిలో మీరు మీ ప్రతిభ ప్రదర్శించలేరు.

-పద్మజ



# గజిబిజికథ

ఇక్కడ ఇచ్చిన నాలుగు బొమ్మలు 'గజిబిజి'గా ఉన్నాయి. వాటిని సరిచేసి పదివాక్యాలకు మించకుండా కథరాసి పంపండి. అన్నిటికంటే బాగున్న కథ ప్రచురిస్తాం. అలాగే కథ బాగారాసిన పదిమంది పేర్లుకూడా ప్రచురిస్తాం. ఆలస్యందేనికి, కథ మొదలుపెట్టండి.



గతనెల 'గజిబిజికథ' జవాబులు

7, 4, 8, 1, 3, 6, 5, 2

జెమిని 7 (అమెరికా) రోదసీ వాహకం లో ఇద్దరు పోగలరు. పొడవు 6మీ. అడ్డుకొలత 3 మీ. అపోలో కార్యక్రమానికి ఇది తోడ్పడింది. రష్యా వారి వోస్టక్-1 ప్రప్రథమంగా రోదసీలోకి తీసుకు వెళ్లింది





'మెర్క్యురీ' రోదసీ వాహకం. దీని ఎత్తు 3·5 మీ: వ్యాసం. 2మీ:





భూ ప్రదక్షిణం చేసిన మొట్టమొదటి ప్రాణి 'లైకా'

'సోయూజ్' రోదసీ వాహకం. పొడవు 7.5మీ అడ్డుకొలత 2·7 మీ. వ్యోమగాములను అటూ-ఇటూ తీసుకు పోవడానికి దీనిని ఉపయోగిస్తారు




# గాడిద తెలివి





చాలా కాలంనాటి మాట. అదో చిన్న ఊరు. ఆ ఊళ్లో ఒక వర్తకుడు ఉండేవాడు. అతనికి వ్యాపారమేకాక, బోలెడంత వ్యవసాయం కూడా ఉండేది. అతని కొట్టం నిండా ఎడ్లు, ఆవులు ఉండేవి. పాలేర్లు ఆ వర్తకుడి వ్యవసాయం చూసేవారు. అతడు మటుకు నెలకు పది రోజులు వ్యాపారం పని మీద ఊళ్ళు తిరిగేవాడు. అలా అతను బయటికి వెళ్ళినప్పుడల్లా ఒక గాడిదమీద ఎక్కి వెళ్ళేవాడు. అతడు ఇంటిపట్టున ఉన్నప్పుడు గాడిదకు పని ఏమీ ఉండేదికాదు. హాయిగా తింటూ సరదాగా కాలం గడిపేది. అన్నట్లు ఇంకో సంగతి, ఆ వర్తకుడికి జంతువుల భాష చక్కగా తెలుసు.

గాడిదకొట్టం పక్కనే ఎడ్ల కొట్టం ఉండేది. అందులో ఒక ఎద్దు రోజంతా పొలంలో గొడ్డు చాకిరి చేసేది. రాత్రి పాలేరు వేసిన గడ్డి ఆవురావురుమంటూ తినేసేది. కుడితి పొయ్యగానే తోక ఊపుకుంటూ తాగేసేది.



ఒకనాడు ఎద్దును చూసి, గాడిద ఇలా అంది: "నేను చూడు. నెలకు పదిరోజులు పనిచేస్తాను. మిగతా రోజులు కమ్మగా తింటూ, కడుపులో చల్ల కదలకుండా పడుకుంటాను. మరి నువ్వో, రోజంతా ఒళ్ళు హూనమయ్యే టట్టు బండ చాకిరీ చేస్తావు" అంది.

"ఏం చేస్తాను. అది నా నుదుటి రాత. నువ్వు నోచుకుని పుట్టావు. అందుకే నిన్ను చూస్తే నాకు అసూయ" అంది ఎద్దు.

"అసూయపడి లాభంలేదు. బతకడం నేర్చుకో. నేను చెప్పినట్టు చెయ్యి. రేపు పొద్దున్నే పాలేరు రాగానే మొండికేసుకుని కూర్చో. పనిలోకి పోవద్దు. దగ్గరకు వస్తే కొమ్ములతో బెదిరించు. ఆ దెబ్బతో వాడు నీ జోలికి రాకుండా వెళ్ళిపోతాడు. ఇద్దరం ఎంచక్కా రోజంతా ముచ్చట్లు చెప్పుకోవచ్చు." అంది గాడిద. చల్లగాలికోసం డాబా మీదికి వచ్చిన వర్తకుడు వాటి సంభాషణ విన్నాడు. మర్నాడు పాలేరు వచ్చి తట్టితే ఎద్దు లేవలేదు. పైగా అతణ్ణి కుమ్మి అవతల పడేసింది. లబోదిబో మంటూ వాడు వర్తకుడి దగ్గరకు వెళ్ళి జరిగిందంతా చెప్పాడు.

"ఏం చేస్తాం. ఎద్దు మొండికేస్తే దాన్ని లొంగతీయడం మన తరం కాదు. ఇవ్వాల్టికి ఎద్దుకు బదులు గాడిదను తీసుకెళ్ళి పనంతా దానితో చేయించు" అన్నాడు వర్తకుడు.

వర్తకుడు చెప్పినట్టుగానే పాలేరు గాడిదను పొలానికి తీసుకెళ్ళాడు. రోజంతా దానితో పొలం దున్నించాడు. మధ్యలో అది మొరాయిస్తే చర్మం ఊడి వచ్చేటట్టు కొట్టాడు. రోజంతా పొలంలో పనిచేసిన గాడిదకు నీరసం ముంచుకొచ్చింది. ప్రాణం పోతుందేమోనని భయం కూడా వేసింది. సాయంత్రం పాలేరు గాడిదను తీసుకొచ్చి కొట్టంలో కట్టేశాడు. గాడిదకు ఒళ్ళంతా పచ్చిపుండులా అయింది. కాస్త కమ్మగా తిని పడుకుంటే తెల్లవారేసరికాల్లా మామూలుగా అవుతాననుకున్న దాని ఆశ నిరాశే అయింది. రోజూ ఇచ్చే రుచికరమైన మేతగాక, ఎడ్లకు వేసే నాసిరకం మేతను దానికి వేశాడు. ఆ మేత గాడిదకు సొక్కలేదు. 'ఇదంతా నా చేతులారా చేసుకున్నాను. హాయిగా తిని పడుకోక, ఆ ఎద్దుకు లేనిపోని సలహాలు ఇచ్చాను. నేను గనక ఇలా రోజంతా పొలం దున్నితే వారం రోజుల్లో చస్తాను. ఎలాగయినా ఈ ఆపదనుంచి తప్పించుకోవాలి అని' ఆలోచిస్తున్న గాడిదకు టక్కున ఒక ఉపాయం తట్టింది. వెంటనే పక్కనే ఉన్న ఎద్దువైపు తిరిగి.

"ఏం ఎద్దు బావా! ఎలా ఉంది నా సలహా" అంది. 'గాడిదబావా! నీ బుర్ర తీసుకెళ్ళి మ్యూజియంలో పెట్టవచ్చు. రోజంతా కమ్మగా తింటూ హాయిగా పడుకున్నాను. నీకు జీవితాంతం ఋణపడి ఉంటాను" అంది ఎద్దు ఆనందంగా.

"అసలు నీకు జీవితం అనేది ఉంటేకదా! ఋణపడి ఉండటానికి" అంది గాడిద విచారంగా మొహం పెట్టి. "అదేమిటి అలా అంటున్నావు?" అంది ఎద్దు భయంగా.

"ఏంలేదు. నేను పొలంనుంచి వచ్చేటప్పుడు మన యజమాని, పాలేరు మాట్లాడుకుంటుంటే విన్నాను. ఆ ఎద్దు మొరాయిస్తోందికదా! ఇక దాన్ని మేపడం దండగ. రేపు గనక అది మాట వినకపోతే దాన్ని తీసుకెళ్ళి కసాయి వాడికి అమ్మేసెయ్. నాలుగు డబ్బులైనా వస్తాయి అన్నాడు. నువ్వు నమ్మవుగానీ ఎద్దుబావా! ఆ మాటలు వినగానే నా గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. నీకు అప్పుడే నూరేళ్ళు నిండిపోయాయా అని వలవలా ఏడ్చాను అంది.

"అమ్మో! చచ్చి సాధించేదేముంది. బతికి బట్టకడితే ఎన్నటికయినా మంచి రోజులు రాకపోతాయా ? రేపటినుంచీ నోరు మూసుకుని పనిలోకి పోతాను" అంది ఎద్దు.

'హమ్మయ్య' అని నిట్టూర్చింది గాడిద. కొట్టం పక్కనే ఉన్న యజమాని, గాడిద మాటలు విన్నాడు. 'గాడిదలకు తెలివిలేదనుకుంటాం కాని, అవి చాలా తెలివిగల జంతువులు' అనుకున్నాడు.

– శ్రీమతి ఎస్. లక్ష్మి

మనిషి - మనుగడ


# నాంబికార తెగ

**నాం**బికారా తెగ బ్రెజిల్ దేశంలో ఉంది. వీళ్ళ జనాభా దాదాపు పదిహేను వందలుంటుంది. వీళ్ళు నివసించే ప్రాంతం వంటలు పండించడానికి అనువైనది కాదు. వీళ్ల అడవిలో దొరికే దుంపల్ని తవ్వుకుని తింటారు. అవేగాక గబ్బిలాల్ని, పక్షుల్ని, పాముల్ని, బల్లుల్ని, సాలెపురుగుల్ని కూడా వారు వేటాడి తింటారు. ఎప్పుడయినా దుప్పి దొరికితే వాళ్ళకు పెద్ద పండుగే. చేపలు కూడా వీళ్ళకి ముఖ్యమైన ఆహారమే. బాణాలతో, బుట్టల సాయంతో వీళ్ళు చేపల్ని పడతారు. వీళ్ళు ఉప్పు అసలే వాడరు. అడవి తేనె అంటే వీళ్ళకు చాలా ఇష్టం.

నాంబికారా తెగలో ఆడవాళ్ళు, మగవాళ్ళు బట్టలు లేకుండానే ఉంటారు. ఆడవాళ్ళు జుట్టు మాత్రం ఉంచుకుని శరీరం మీద మిగతా వెంట్రుకలు లేకుండా చూసుకుంటారు. మగవాళ్ళు పైపెదవిని, కింది పెదవిని వెదురు ముక్కలతో అలంకరించుకుంటారు. ముళ్ళపంది ముళ్లతో అలంకరించిన ఒక ఈకను ముక్కు దూలం గుండా అడ్డంగా గుచ్చుకుని ఆభరణంలా ధరిస్తారు. ఆడవాళ్ళు పూసలతో చేసిన కడియాలు, కాళ్ళకు, చేతులకు ధరిస్తారు.

వీళ్ళు మంచాలు వాడరు. ఇసుకలోనే వెచ్చని బూడిదలోనే, పడుకుని నిద్రపోతారు. తెల్లవారేసరికి ఒళ్ళంతా బూడిదతో నిండిపోయి ఉంటుంది. వీళ్ళు తరుచుగా స్నానం చేస్తూ తమ శరీరాన్ని శుభ్రంగా ఉంచుకుంటారు.

ఇప్పుడిప్పుడే వీళ్ళు గుడిసెలు కట్టుకుంటున్నారు. వీళ్ళకి పెంపుడు జంతువులంటే ప్రాణం. కుక్కలన్నా, కుక్క పిల్లలన్నా, బాగా ఇష్టపడతారు. వీళ్ళ సంగీతం



గందరగోళంగా ఉండక సాఫీగా ఉంటుంది. పిల్లనగ్రోవి వీళ్ళ వాయిద్యాలలో ముఖ్యమైనది. దీనిని వీరు నోటితో వాయించరు. ముక్కుతో వాయిస్తారు.

మరణించిన వారి ఆత్మలన్నా, విషం అన్నా, వీళ్ళకు భయం. అసలు వీళ్ళ మతం ఈ భయం మీదే ఆధారపడి ఉంది. వీళ్ళ పూజారులు వైద్యం కూడా చేస్తారు. రోగం వచ్చిన వాడి శరీరంనుంచి, దుష్టశక్తిని వీళ్ళు నోటితో పీల్చి వేస్తారు. సామాన్యంగా పూజారికి తెగమీద కొంత పట్టు ఉంటుంది. నాగరికతా ప్రభావం వీళ్ళమీద ఇప్పుడిప్పుడే పడుతూంది. విచిత్రమేమిటంటే వీళ్ళకు మద్యపానం అంటే బొత్తిగా ఇష్టం ఉండదు.

వాసు




# ప్రేమను ప్రభోదించే పండుగ – క్రిస్‌మస్

క్రైస్తవులకు 'క్రిస్‌మస్' చాలా పెద్ద పండుగ. ఈ పండుగ ప్రతీ సంవత్సరం డిశంబర్ 25న వస్తుంది. ఈ పండుగకు క్రైస్తవులందరూ ఆనందోత్సాహాలతో చర్చిలకు వెళ్ళి ప్రార్థనలు జరుపుతారు. వారి వారి ఇళ్ళలో క్రిస్‌మస్ చెట్టును అమర్చి దానికి రకరకాల దీపాలు, కాగితం పూలు, పండ్లు, మొదలగు ఇతర వస్తువులు అందంగా అలంకరిస్తారు. ఈ 'చెట్టు'ను ఇలా అమర్చడానికి చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి.

పూర్వం దేవుళ్ళకు చిన్న పిల్లలను బలి ఇచ్చేవారు. 'విన్‌ఫ్రెడ్' అనే ఆంగ్ల క్రైస్తవుడు ఒకసారి ఉత్తర జర్మనీ అరణ్యాలలో తిరుగు తూండగా 'ఆసల్ఫ్' అనే యువరాజును ఒక పెద్ద ఓక్ వృక్షానికి కట్టి ఉంచడం చూశాడు. ఉరుములకు అధిపతి అయిన 'థోర్' అనే దేవుడికి అతన్ని బలి ఇవ్వడానికి సిద్ధం చేశారు. 'విన్‌ఫ్రెడ్' అక్కడకు వెళ్ళి నెత్తుటి ఓక్ వృక్షాన్ని నరికించి ఆ యువరాజుని రక్షించాడు. థోర్ దేవుని అర్చకులు విన్‌ఫ్రెడ్‌ను చంపి ఉండేవారే! కాని హఠాత్తుగా ఒక వింత సంఘటన జరిగింది. వారి కళ్ళ ఎదుటే ఆ ఓక్ చెట్టుకు బదులు చిన్న దేవదారు మొక్క వచ్చింది. ఆశ్చర్యపోయిన ప్రజలకు 'ఆజీవ వృక్షం క్రీస్తు పుత్రుని ప్రతినిధి' అని విన్‌ఫ్రెడ్ చెప్పాడు. అప్పటినుంచి క్రిస్‌మస్‌కు క్రైస్తవులు చెట్టును అలా అలంకరించి పూజిస్తారు. అదేవిధంగా తెల్లటి మీసాలు, గెడ్డాలతో, ఎర్రటి చొక్కాతో, నెత్తిమీద టోపీతో ఉండే క్రిస్‌మస్ తాత 'శాంతాక్లాజ్' పిల్లలకోసం ఏదో ఒక బహుమతిని తెచ్చి ఆ రాత్రి ఇంట్లోపెట్టి పోతాడన్న నమ్మకం పిల్లల్లో ఉంటుంది.

పిల్లలకు ఇంత ఆనందాన్ని కలుగజేసే క్రిస్మస్ తాత, సెయింట్ నికోలస్ అనబడే నాలుగవ శతాబ్దపు ఒక బిషప్! ఈయన ఒక జింకల బండిమీద ప్రయాణిస్తాడనీ, చిమ్నీ (పొగగొట్టం) లోంచి ఇళ్ళలోకి దిగివచ్చి పిల్లలకోసం బహుమతులను ఉంచి పోతాడని రకరకాల కథలు వ్యాప్తిలో ఉన్నాయి. క్రైస్తవులందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే పండుగ ఈ 'క్రిస్‌మస్'.





# బంగారు దీవి

## సీరియల్ - 1

ఈ కథ మొదలైనప్పుడు నేను చాలా చిన్నవాణ్ణి. నాపేరు జిమ్ హాకిన్స్. మాకు ఒక సత్రం ఉండేది. ఒకనాడు మా సత్రానికి బాగా ఒడ్డూ పొడుగూ ఉన్న ఒక మనిషి వచ్చాడు. అతనికి ఒకచెంపమీద కత్తిగాటు ఉంది. వస్తూనే...

'చచ్చినవాడి పెట్టెమీద పదిహేను మంది.

అహ్హహ్హా! ఏది తే ఒక గ్లాసు రమ్ము'.

అంటూ ఒక పాత సముద్రపు పాటను అందుకొన్నాడు. ఒక గ్లాసు రమ్ము తీసుకొని రమ్మని నాన్నకు చెప్పి, బోలెడన్ని బంగారు నాణేలు నిర్లక్ష్యంగా బల్లమీదకు విసిరి వేశాడు. అందరూ తనను కాప్టెన్ అని పిలవాలని చెప్పాడు. నాన్న కాప్టెన్‌కు గది చూపించాడు. కాప్టెన్ తన గదిలోకి వెళ్ళిపోయాడు. కాప్టెన్ మా సత్రంలో చాలా రోజులు ఉన్నాడు. అతను ఎవరితోనూ ఎక్కువ మాట్లాడేవాడు కాదు. మెడకు ఒక ఇత్తడి టెలిస్కోపు తగిలించుకుని రోజంతా సముద్రపు ఒడ్డునే, కొండరాళ్ళ మీదనే కాలం గడిపేవాడు. సాయంత్రాలు మటుకు సత్రంలోనే కూచొని బాగా రమ్ము తాగేవాడు. సముద్రం నుంచి సత్రానికి రాగానే 'సత్రానికి ఎవరన్నా నావికుడు వచ్చాడా?' అని మరచి పోకుండా అడిగేవాడు. రోజూ అదే ప్రశ్న అడగటం వల్ల, కాప్టెన్ ఎవరి నుంచో, దేనినుంచో తప్పించుకోవడానికి మా సత్రంలో దాక్కున్నాడేమో అని నాకు అనిపించింది.

ఒకనాడు కాప్టెన్ నన్ను పక్కకు తీసుకెళ్ళి నాతో ఇలా అన్నాడు. 'జాగ్రత్తగా కనిపెడుతూ ఉండు. ఎప్పుడయినా సరే, ఒక ఒంటికాలి నావికుడు ఇటువస్తే ఆ విషయం నాకు వెంటనే చెప్పాలి. నేను చెప్పినట్టు చేస్తే నీకు ప్రతీ నెలా ఒక వెండి నాణెం ఇస్తాను' అన్నాడు.

కాప్టన్ మాసత్రంలో చాలా రోజులు ఉన్నాడు. క్రమంగా అతని దగ్గర ఉన్న డబ్బంతా ఖర్చయిపోయింది. సత్రం ఖాళీ చెయ్యమని కాప్టెన్‌ని అడగడానికి నాన్నకు ధైర్యం ఉండేది కాదు. అనుకోకుండా మానాన్నకు పెద్ద జబ్బు చేసింది. డాక్టరు లివిసే మానాన్నకు మందు ఇవ్వడానికి వచ్చాడు. అంతకుముందు కూడా



ఆయన మా సత్రానికి ఎన్నోసార్లు వచ్చాడు. ఒకనాడు బాగా తాగిన కాప్టెన్ డాక్టరును పొడవడానికి ఒక చాకును బయటకు తీశాడు. డాక్టరు ఏమాత్రం భయపడలేదు. 'మర్యాదగా ఆ చాకు లోపల పెట్టుకోకపోయావో, నిన్ను ఉరికంబం ఎక్కిస్తాను' అన్నాడు.

కాప్టెన్ కాస్సేపు డాక్టర్ కళ్ళలోకి తదేకంగా చూశాడు. తరవాత చూపులు పక్కకు తిప్పుకున్నాడు. ఏదో గొణుక్కుంటూ చాకు లోపల పెట్టుకున్నాడు.

మానాన్నకు జబ్బు బాగా ఎక్కువయింది. ఆయన బతుకుతాడని మాకు ఎవరికి నమ్మకం లేదు. ఒకనాడు పొద్దున్నే మా సత్రానికి ఒక మనిషి వచ్చాడు. అతడు సన్నగా ఉన్నాడు. ఎడమ చేతికి రెండు వేళ్ళు లేవు. వస్తూనే నాపేరు అడిగాడు. ఒక గ్లాసు రమ్ము తెమ్మన్నాడు.

'నా స్నేహితుడు బిల్ ఇక్కడే ఉన్నాడు కదూ' అన్నాడు. "బిల్ ఎవరో నాకు తెలియదని చెప్పాను'. "మేము గాక మా సత్రంలో ఒక కాప్టెన్ మాత్రం ఉంటున్నాడని చెప్పాను. కాప్టెన్ ఎలా ఉంటాడో చెప్పాను".

'సరిగ్గా చెప్పావు. ఆ కాప్టెన్ నా స్నేహితుడు. మనం ఒకపని చేద్దాం. వెళ్ళి ఆ తలుపు వెనక నించుందాం. కాప్టెన్ రాగానే మనల్ని చూసి ఆశ్చర్యపోతాడు' అన్నాడు. మేం అలాగే చేశాం.


కాప్టెన్ లోపలికి వచ్చాడు. అతను కొంచెం ముందుకు వెళ్ళగానే 'బిల్' అని పిలిచాడు ఆ కొత్త వ్యక్తి.

కాప్టెన్ గిర్రున వెనక్కి తిరిగాడు. మమ్మల్ని చూడగానే అతని మొహం తెల్లగా పాలిపోయింది.

'బిల్ నన్ను గుర్తు పట్టలేదా? నీ పాత స్నేహితుణ్ణి' అన్నాడు.

"నల్లకుక్క" అన్నాడు కాప్టెన్.

"సరిగ్గా గుర్తు పట్టావు. మనం కొంచెంసేపు మాట్లాడుకుందాం". అన్నాడు నల్లకుక్క. "నన్ను వెళ్ళి రెండు గ్లాసుల రమ్ము తీసుకు రమ్మన్నాడు. వాళ్ళమాటలు నాకు సరిగ్గా వినిపించలేదు. వాళ్ళు చాలా నెమ్మదిగా మాట్లాడుకున్నారు. తరవాత వాళ్ళు పెద్దగా అరుచుకుంటూ, కుర్చీలు, బల్లలు ఒకళ్ళ మీదకు మరొకళ్ళు విసిరి వేసుకున్నారు. తరవాత కత్తులు తీసుకుని కలియ బడ్డారు. కాప్టెన్ కత్తి వేటుకు నల్లకుక్కకు పెద్ద గాయం అయింది. బాగా రక్తం కారింది. అయినా ఎలాగో కాప్టెన్ కత్తి దెబ్బలను తప్పించుకుని, నల్లకుక్క పారిపోయాడు.



కాప్టెన్, నల్లకుక్క పారిపోయిన వైపే చూస్తూ ఉండిపోయాడు. తరవాత ఒక్కసారిగా విరుచుకు పడిపోయాడు. ఏం చేయాలో తెలియక నేనూ అమ్మ అయోమయంలో పడిపోయాం. ఇంతలో నాన్నను చూడటానికి డాక్టరు లెవిసీ వచ్చాడు. ఆయన్ని చూడగానే మా ప్రాణం లేచివచ్చింది.

డాక్టర్ లెవిసీ కాప్టెన్‌ను పరీక్ష చేశాడు. అతనికి దెబ్బలేమీ తగలలేదు. గుండెపోటు వచ్చిందని డాక్టర్ చెప్పాడు. డాక్టర్ కాప్టెన్‌ను అటూ ఇటూ దొర్లించి రక్తం తీసుకోవడానికి కాప్టెన్ చొక్కా చేతులు పైకి మడిచాడు. కాప్టెన్ బుజంమీద 'బిల్లీబోన్స్, పచ్చబొట్టు పొడిచిన అక్షరాలు కనిపించాయి. ఎలాగో తిప్పలు పడి కాప్టెన్‌ను అతని గదిలోకి తీసుకెళ్ళాం. అతను రమ్ము అడిగితే ఇవ్వవద్దనీ ఇస్తే ఇంకోసారి గుండెపోటు వస్తే బతకడనీ చెప్పి డాక్టరు వెళ్ళిపోయాడు.

(ఇంకావుంది)

# చెలిమి క్లబ్

**చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి**

**లాభాలు పొందండి.**

* చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
* మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
* మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
* మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
* అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జ్.
* మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు

**చెలిమి క్లబ్**

చెలిమి ఏడాది చందా 40/-

M.O./P.O./D/D/ ద్వారా పంపించిన

నం. __________

పేరు __________

తరగతి __________ పుట్టినతేదీ __________

హాబీలు __________

చిరునామా __________

పిన్ __________

**సభ్యత్వం పొందడం ఎలా?**

పదిహేను సంవత్సరాలలోపు పిల్లలకే సభ్యత్వం.

బాలచెలిమికి ఏడాది చందా కట్టి లేదా కట్టించి రిసిప్ట్ నంబర్ వివరిస్తూ కూపన్ నింపి పంపండి.





**అనంత్ (15 సం॥)**
హాబీలు: కార్టూన్లు గీయడం, పత్రికలు చదవడం.
C/o నాగభూషణం, తాళ్ళగడ్డ,
మిర్యాలగూడ -508 207
నల్లగొండ జిల్లా.

**బేబి రచన (10 సం॥)**
హాబీలు: 'బాలచెలిమి'తో చెలిమి, జోక్స్, డాన్స్, క్యారమ్స్ ఆడటం.
D/o హద్దునూరి నాగేంద్రం,
ఇం నెం. 2-6-47, పురాణిపేట వీధి,
పో॥ జగిత్యాల - 505 327
కరీంనగర్ జిల్లా.

**యు. విజయలక్ష్మి (11 సం.)**
హాబీలు: ఆటలు, నాట్యం, స్కిప్పింగ్
D/o U. సీమారాజు
మర్రిచెట్టు వీధి, గొల్లగూడెం,
తాడేపల్లి గూడెం, ప.గో. జిల్లా.

**యస్.వి.కె. రెడ్డి (13 సం.)**
హాబీలు: షటిల్, కథల పుస్తకాలు చదవడం, లైబ్రరీకి వెళ్ళడం, పేపర్ చదవడం.
S/o S. యాదిరెడ్డి, ఇం.నెం.12-2-135
గణేష్ నగర్ వీధి,
సిద్దిపేట్ - 502 103 మెదక్ జిల్లా.

**జి. స్వాతి (11 సం.)**
హాబీలు: ఆటలు, చిన్న పిల్లల పుస్తకాలు చదవడం
ఇం.నెం. 1-9-134/2, రాంనగర్,
హైదరాబాద్ - 500 048

**హెచ్. రామ సుబ్బారెడ్డి (15 సం.)**
హాబీలు: పాటలు పాడటం, జి.కె., స్టాంపుల సేకరణ.
S/o. H. రామిరెడ్డి,
గ్రా. గుళ్ళదుర్తి, తా॥ కోవెలకుంట్ల
కర్నూలు - 518 138.

# అలా చూడు చెల్లాయ్!



పాపాయీ! కదలిరా!
పరుగు తీసి తరలిరా!
బడి దాపున తోటలో
భలే వింతలున్నవి రా! "పాపాయీ!"

పళ్ళ చెట్లు పూలచెట్లు
పక్షులు కోకొల్లలు!
వింత సోయగాలు చూడు!
విరుల రంగులెన్నొ చూడు! "పాపాయీ!"

కుదురుగా పక్షులన్ని
కూర్చుకున్న గూళ్లు చూడు!
కలసి మెలసి 'చెలిమి'తో
మెలగుతున్న తీరు చూడు! "పాపాయీ!"

పాట పాడు కోయిలలు
ఆటలాడు నెమళ్లు
అరమరికలు తెలియవు
అహంకార మెరుగవు!! "పాపాయీ!"

అలా చూడు చెల్లెలా-
అరవిరిసిన గులాబీలు!
చక్కని ఆ పువ్వులకు
పక్కన ముళ్లున్నవి! "పాపాయీ!"

మొగలి పొదల మాటున
పొంచెను మిన్నాగులు!
సింగారపు రీతిలో
చిత్రమైన లోతులు! "పాపాయీ!"

'మల్లెతీగ' సొగసరి
భలే గొప్ప గడసరి
ఎంత యెత్తు పందిరైన
ఎగబాకే నేర్పరి!
పట్టుపట్టి పైకి పోవు
కిటుకు యెవరు నేర్పిరి! "పాపాయీ!"



— గాలి ప్రభావతి

# వసంతసేన



పూర్వం ఉజ్జయినీ నగరంలో చారుదత్తుడనే వర్తకుడు ఉండేవాడు. అతడు పొడుగ్గా, అందంగా ఉండేవాడు. ఉజ్జయినీ నగర ప్రజలందరికీ అతనంటే చాలా ఇష్టం. అయితే చారుదత్తుడు వ్యాపారంలో చాలా పోగొట్టుకున్నాడు. చివరికి అతనికి పాతకాలపు నాటి ఇల్లు మాత్రమే మిగిలింది. చారుదత్తుడితో పాటు అతని మిత్రుడు మైత్రేయుడు కూడా ఆ యింట్లోనే ఉండేవాడు. ఇంట్లో ఒక సేవకురాలు మాత్రం ఉండేది.

ఒకనాడు సాయంత్రం వీధి తలుపు దడదడా చప్పుడవుతోంది. తలుపు తీసిన మైత్రేయుడికి చాలా నగలు ధరించిన ఒక అందమయిన యువతి, ఆమెవెంట మరో యువతి కనిపిస్తారు.

తాము సాయంత్రం ఉద్యానవనంలో విహరించడానికి వెళ్లామనీ, అక్కడ రాజుగారి బావమరిది అయిన సంస్థాపకుడు, అతని మనుషులు తమను తరిమారనీ వారిని తప్పించుకొని ఇటు వచ్చామనీ ఆ యువతి చెబుతుంది. కొంతసేపు తమకు ఆశ్రయం ఇవ్వమని చారుదత్తుణ్ణి అడుగుతుంది.

# BHARAT ENGINEERING WORKS



MANUFACTURERS OF 'BHARAT' BRAND SODA, FOAM, HALON, $CO_2$, DRY POWDER FIRE EXTINGUISHERS AND FIRE FIGHTING EQUIPMENT

BHARAT

**BHARAT ENGINEERING WORKS**

15, NAVNANDANVAN INDUSTRIAL ESTATE, L.B.S. MARG,
MULUND (WEST), BOMBAY - 400 080.
PHONE : FAC. 5613661, 5617351L; OFF. 2043377, 224905
GRAMS : 'FOAMSODAEX'; TELEX : 11-6091 BEW IN
PHONE : HYDERABAD : 66367, 62367

ఆ యువతిపేరు వసంతసేన. ఆమె చాలా సంపన్నురాలు. తల్లితో కలిసి పెద్ద భవంతిలో ఉంటోంది. చారుదత్తుడు వసంతసేనను చూడగానే ప్రేమలో పడతాడు. అసలు అంత అందమైన యువతిని అతను అప్పటి వరకు చూడలేదు. అంత రాత్రివేళ అన్ని నగలు ఒంటిమీద పెట్టుకుని బయటికి పోవడానికి వసంతసేన భయపడుతూంది. అందుకే నగలన్నీ తీసి చారుదత్తుడికిచ్చి భద్రపరచమని చెబుతుంది. తరవాత వచ్చి తీసుకుంటానంటుంది. చారుదత్తుడు వాటిని జాగ్రత్తగా దాస్తాడు. అతడు, మైత్రేయుడు, వసంతసేనను, ఆమె చెలికత్తె మందాకినిని ఇంటిదాకా దింపి వస్తారు. చారుదత్తుడికి వసంతసేన పైన ఉన్న ప్రేమ క్రమంగా పెరిగింది. వసంతసేన కూడా చారుదత్తుణ్ణి ప్రేమిస్తుంది. ఒకనాడు సాయంత్రం వసంతసేన అతని యింటికి వచ్చింది. వసంతసేన వచ్చిందో లేదో పెద్దవాన ముంచుకు వచ్చింది. ఎడతెరపి లేని వానకు వీధులన్నీ బురద అయ్యాయి. వసంతసేన ఇంటికి వెళ్ళలేక ఆ రాత్రి చారుదత్తుడి ఇంట్లోనే ఉండిపోయింది.

మరునాడు పొద్దున్నే లేచిన వసంతసేనకు చారుదత్తుడు కనిపించలేదు. చారుదత్తుడు, మైత్రేయుడు పూలతోటకు వెళ్ళారని, వసంతసేన అక్కడికి రావడానికి బండి పంపిస్తామన్నారని సేవకురాలు చెబుతుంది.

ఇంతలో ఇంటిముందు బండి ఆగుతుంది. నగలేవీ అలంకరించుకోకుండానే వసంతసేన ఆ బండిలో ఎక్కి కూర్చుంటుంది. ఇంతకీ ఆ బండి చారుదత్తుడిది కాదు. సంస్థాపకుడిది. వీధి అంతా బురదగా ఉండటం వల్ల ఆ బండి ముందుకు పోలేక చారుదత్తుడి ఇంటిముందు ఆగిపోయింది. అదే చారుదత్తుడు పంపిన బండి అనుకుని వసంతసేన అందులో ఎక్కుతుంది.

బండిలోనుంచి దిగిన వసంతసేనను చూసి సంస్థాపకుడు ఉబ్బితబ్బిబ్బయి పోతాడు. తనను ప్రేమించి వసంతసేన తనకోసం వచ్చిందనుకుంటాడు. చారుదత్తుడికోసం వచ్చానని వసంతసేన చెప్పగానే అతను కోపంతో మండిపడతాడు. అంతమందిలో ఆమెను ఏమీ చేయలేక ఇంటివద్ద దిగబెడతానని చెప్పి బండిలో ఎక్కించుకుంటాడు.

మరునాడు - వసంతసేన ఊరిబయట పొదలలో చచ్చి పడిఉండటం తాను చూశాననీ చారుదత్తుడు ఆమెను హత్యచేసి నగలు దొంగిలించాడనీ న్యాయమూర్తి ఎదుట ఫిర్యాదు చేస్తాడు. రాజభటులు చారుదత్తుణ్ణి బంధించి తీసుకు వస్తారు. చారుదత్తుడికి మరణ శిక్ష పడుతుంది.

చారుదత్తుణ్ణి ఉరితియ్యడానికి తీసుకు వెడతారు. చారుదత్తుడిలాంటి మంచివాడు ఉరికొయ్య ఎక్కడం ప్రజలకు ఇష్టం ఉండదు. వాళ్ళు ఏమీ చెయ్యలేక కోపాన్ని, విచారాన్ని లోలోపలే దిగమింగుకుంటారు. చారుదత్తుడు ఉరికంబం ఎక్కే లోపలే "ఆగండి- ఆగండి! నేను వసంతసేనను. నేను చావలేదు. బతికే ఉన్నాను." అని అరుస్తూ వసంతసేన అక్కడికి వచ్చింది. ఆమె న్యాయమూర్తికి జరిగిందంతా చెబుతుంది. తనను ఇంటి దగ్గర దింపుతానన్న సంస్థాపకుడు పొదలలోకి తీసుకువెళ్ళి తన గొంతు పిసికి పొదలలో పారేసి పోయాడని చెబుతుంది. స్పృహ తప్పి ఉన్న తనను ఒక బౌద్ధ భిక్షువు చూసి, రక్షించి, తన ఆశ్రమానికి తీసుకు వెళ్ళాడనీ, ఆ బౌద్ధ భిక్షువు వల్ల చారుదత్తుడికి విధించబడిన ఉరిశిక్షను గురించి విన్నాననీ అతన్ని కాపాడటానికే పరుగెత్తుకు వచ్చాననీ చెబుతుంది. న్యాయమూర్తి చారుదత్తుణ్ణి విడుదల చేస్తాడు. చారుదత్తుడు వసంతసేనను వివాహం చేసుకుని హాయిగా కాలం గడుపుతాడు.

**అనాస ఆకులతో దారం తయారీ**

చెట్ల ఆకులతో తయారైన వస్త్రాలు నాగరిక ప్రపంచంలోకి రాబోతున్నాయి. సౌత్ ఇండియా టెక్స్‌టైల్ రీసెర్చ్ అసోసియేషన్ (SITRA) అనాస ఆకుల నుంచి దారం తీయడంలో విజయం సాధించింది. నూటికి నూరుశాతం అనాస ఆకుల నుంచి దారాన్ని తయారు చేయవచ్చునీ, అలాగే పాలియేస్టర్, ఉన్ని, నూలు జూట్ దారాలతో కలిసిన బ్లెండెడ్ యార్న్ తయారీ కూడా సాధ్యమని ఈ సంస్థ తెలుపుతుంది.

# మ్యాంగోషైనర్

(ఫ్రూట్ న్యూట్రియంట్ మొబిలైజర్)

* ఇది మొక్కలనుంచి తీసిన ద్రవం.
* పోషక విలువలనూ, హార్మోనుల వృద్ధినీ ప్రభావితం చేయగల ఆయుర్వేద మార్గం.
* ఆకులనుండి కాయలకు పోషక విలువలను చేరవేసేస్తుంది.
* ఇందులో కొన్ని ప్రత్యేక పోషక విలువలు ఉన్నందువల్ల, ఫలాలకు మంచి మెరుపు వస్తుంది.
* కణ విభజన, కణ పెరుగుదల వంటి పలు ప్రక్రియల ద్వారా, ఫలాలకు అధిక రసాన్ని సమకూర్చడంలో ఉపయోగ పడుతుంది.
* కాయల్లో పెరుగుదల శాతాన్ని పెంచే ఆక్సిన్ లెవెల్‌ను పెంచుతుంది.
* మ్యాంగో షైనర్‌లో మొక్కల హార్మోనులు లేవు కానీ, హార్మోనుల రేటునూ, పోషక విలువల ప్రసారాన్నీ ఇది ప్రభావితం చేస్తుంది.
* ఒక ఎకరం మామిడి తోటలో కేవలం ఒక లీటరు మ్యాంగోషైనర్ స్ప్రే చేయండి.
* సత్ఫలితాల కోసం పిందె పరిమాణంలో స్ప్రే చేయండి.
* కలిపే ముందు సీసాను బాగా కదిలించండి.
* మ్యాంగోషైనర్ ఇతర పురుగుమందులు అన్నింటితోనూ కలిపి స్ప్రే చేసిననూ ఎలాంటి హాని కలుగదు.
* ప్రాణులకు దీనివల్ల ఎట్టి ప్రమాదమూ లేదు.

## మ్యాంగో షైనర్

(ఫ్రూట్ న్యూట్రియంట్ మొబిలైజర్)

**మీ మామిడి తోటలలో పసిడి పండిస్తుంది.**




ఇతరవివరములకు :
రిలయెంట్ కెమికల్స్, 1-10-10, అశోకనగర్, హైదరాబాదు - 500 029 వారిని సంప్రదించండి.


మేఘా డిస్ట్రిబ్యూటర్స్ : హిందూస్తాన్ ఫెర్టిసైడ్స్, 16-8-239, మలకపేట, హైదరాబాద్ - 500 036. Ph: Off: 521533 Res: 526533

# పిరమిడ్‌లు

ఏడు వింతలు అనే మాట మీరు వినేవుంటారు. వీటిని ఇంగ్లీషులో సెవెన్ వండర్స్ అని అంటాము. ఈ ఏడు వింతలలో ఆరు వింతలు మనం ఇప్పుడు చూద్దామన్నా లేవు. ఒక్క వింత మటుకు ఇప్పటికీ నిలిచేవుంది. ఆ వింతపేరే 'పిరమిడ్'. ఈ పిరమిడ్‌లు ఈజిప్టు దేశంలో ఉన్నాయి. ఆ కాలంలో రాజుల సమాధుల మీద పెద్ద భవనాలు కట్టేవారు. అవే పిరమిడ్స్. ఈ భవనాలు త్రిభుజాకారంలో నిర్మించేవారు. సమాధిని మటుకు ఒక పెద్ద రాయిలో తొలచి దాని చుట్టూ రాతితోను ఇటుకలతోను అనేక గదులు, వసారాలు కట్టేవారు. రాజు రాచకుటుంబీకులు చనిపోతే వారిని ఈ పిరమిడ్స్‌లో సమాధి చేసేవారు. చనిపోయిన వ్యక్తితోపాటు, అతని కిష్టమయిన వస్తువులన్నిటిని ఆ వ్యక్తి పక్కన ఉంచేవారు. అంతేకాదు అనేకమంది సేవకులు కూడా తమ ప్రభువుతో పాటు సజీవసమాధి అయ్యేవారు.

జోసెర్ సకారా అనే రాజు గారి సమాధి మీద కట్టబడన పిరమిడ్, పిరమిడు లన్నిటిలోకి పాతది. ఇయ్‌హెూటిప్ అనే వాస్తు శిల్పి దీని నిర్మాణంలో ప్రధాన పాత్ర వహించాడు. ఇది మెట్ల వరుసల మీద కట్టబడింది. అందుకే దీనిని స్టెప్ పిరమిడ్ అంటాము. ఈ పిరమిడుల వయస్సు వింటే మీరు ఆశ్చర్యంతో నోరు తెరుస్తారు.

ఇంతకీ వీటి వయస్సెంతో తెలుసా? వీటిలో కొన్ని సుమారు అయిదువేల సంవత్సరాల క్రింద నిర్మింపబడినవి. ఈ పిరమిడ్‌ల నిర్మాణానికి



ఎంతో పెద్ద మొత్తంలో రాయికావలసి వచ్చేది. దూర దూర తీరాల నుంచి పెద్ద పడవల మీద బండరాళ్లను నైలునది గుండా తీసుకు వచ్చేవారు. ఆ రాళ్లను ఏనుగులు నిర్మాణ ప్రదేశానికి తీసుకు వచ్చేవి. రాళ్ళు కాక కాల్చిన ఇటుకలను కూడా వీటి నిర్మాణంలో వాడేవారు. ఈ పిరమిడ్‌ల నిర్మాణంలో వేలాది కూలీలు పనిచేసేవారు. చచ్చిన తమ రాజుకు సమాధిలో అన్ని సుఖాలను అమర్చి పెట్టేవారు. బానిసలా పనిచేసిన వాళ్ల జీవితంలో మటుకు ఎప్పుడూ చీకటే మిగిలి ఉండేది. పిరమిడులలో తమ సంపదనంతా, తమ సేవకులతో సహా దాచుకొన్న ఆ రాజులు, ఇతర ప్రభువులు వాటిని నిలుపుకోలేక పోయేవారు. బందిపోటు ముఠాలు చాలా పిరమిడులను దోచుకొని కొన్నింటిని ధ్వంసం కూడా చేశారు. ఏది ఏమయినా అయిదు వేల సంవత్సరాల క్రితం నాటి మానవుడి గొప్ప పనితనానికి నిదర్శనంగా పిరమిడులు మన కళ్ల ముందు నిలుస్తాయి.

# ఈ నెల కథ

క్రీస్తుశక కాల పరిగణనలో 'డిశంబర్' పన్నెండవ నెల. జూలియస్ సీజర్ కేలండర్‌ను సంస్కరించినప్పటికీ, అంతకు పూర్వం ఉండే పదవనెల అని అర్థం వచ్చేదయినా, ఆపేరు పన్నెండవ నెలకు అన్వయింపబడుతూనే ఉంది. శాలివాహన శక కాల పరిగణన ప్రకారం ఇది 'మార్గశిరమాసం'. ఈనెలను 'ధనుర్మాసం' అని కూడా పిలుస్తారు. ఈనెలలో చలి ఎక్కువగా ఉంటుంది. డిశంబర్‌కు 'క్రిస్‌మస్' పండుగ వలన ఎంతో ప్రాధాన్యం, పవిత్రత వచ్చింది. ప్రపంచంలోని క్రైస్తవులందరూ ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు.


Tel : 63408

***VISIT FOR :***

**SCHOOL & COLLEGE TEXT BOOKS,**
**GUIDES, LATEST 1991 MODEL PAPERS**

OXFORD GRAMMAR SCHOOL, ST. ANTHONY SCHOOL
BOOKS & GUIDES AVAILABLE

**JYOTHI BOOK CENTRE**
**BOOK SELLERS & STATIONERS**
**3-6-752/5, HIMAYAT NAGAR,**
**HYDERABAD.**


# పెంగ్విన్

**ప**క్షిజాతికి చెందినా ఎగురలేని పక్షి పెంగ్విన్.

పెంగ్విన్ పక్షులను దూరంనుంచి చూస్తే తెల్లని చొక్కా, నల్లకోటు వేసుకున్న మనుషుల్లాగా ఉంటాయి. ఇవి సముద్రపు పక్షులు. పెంగ్విన్‌లు ఎక్కువగా మంచు ఖండమైన అంటార్కిటికాలో ఉంటాయి. పెంగ్విన్‌లలో దాదాపు 17 రకాలున్నాయి. వీటిలో ఎంపెరర్ పెంగ్విన్‌లు 4 అడుగుల ఎత్తు, 36 కిలోల బరువు వరకు ఉంటాయి. పెంగ్విన్‌లు చాలా చక్కగా, వేగంగా నీటిలో ఈదుతాయి. చిన్నగా తెడ్లలాగా ఉండే రెక్కలతో ఇవి నీటి అడుగున ఈదుతాయి. నేలమీద ఇవి గెంతుతూ నడుస్తాయి. మంచుమీద మాత్రం పొట్టమీద పడుకుని జారుతూ పోతాయి. సముద్రంలో నుంచి బయటికి రావడానికి ఇవి గాలిలో ఆరు అడుగుల దూరం వరకు గెంతుతాయి. పెంగ్విన్‌ల ముఖ్య ఆహారం చేపలు. ఇవి వాడిగా ఉండే ముక్కుతో చిన్న చిన్న చేపలను పట్టుకుని తింటాయి.

ఆడ పెంగ్విన్ ఒకే ఒక గుడ్డు పెడుతుంది. తండ్రి పక్షి దానిని పొదుగుతుంది. తండ్రి పెంగ్విన్ గుడ్డును కాళ్ళమీద వేలాడుతున్న చర్మపు పొదల మధ్య వెచ్చగా ఉంచుతుంది. ఆ రెండు నెలలు తండ్రి పెంగ్విన్ ఆహారం తీసుకోకుండా అలాగే నిలుచుని ఉంటుంది. గుడ్డు చీల్చుకుని పెంగ్విన్ బయటకి రాగానే తల్లి పెంగ్విన్ దానికి ఆహారం అందిస్తుంది. ఇలా పిల్ల పెరగడంలో కూడా రెండూ శ్రద్ధ చూపుతాయి.

పెంగ్విన్ పక్షులలో నీలి పెంగ్విన్ చాలా చిన్నది. యిది కేవలం 14 అంగుళాల ఎత్తు మాత్రమే ఉంటుంది. భూమధ్య రేఖకు దగ్గరగా ఉండే గాల పాగోస్ ద్వీపాలలో ఉండే ఈ పెంగ్విన్‌ను 'గాల పాగోస్' పెంగ్విన్ అంటారు.



# బారిష్టర్ పార్వతీశం

పిల్లలూ -

మన తెలుగులో ఎన్నో చక్కని పుస్తకాలున్నాయి. కావ్యాలు, నాటకాలు, కథలు ఇలా ఏకరువు పెడుతూ ఉంటే మన లెక్కలోకి చాలా వస్తాయి. వీటన్నింటిని కలిపి మనం 'సాహిత్యం' అంటాం. ప్రపంచ భాషలన్నిటి లోనూ మంచి సాహిత్యముంది. ఇంట గెలిచి రచ్చ గెలవాలనే సామెత మీరు వినే ఉంటారు. మన సాహిత్యం గురించి తెలుసుకొంటే ఇతర భాషల సాహిత్యాన్ని తెలుసుకోవటం సులువు. మన సాహిత్యంలో 'నవల'కి పెద్ద పీటే ఉంది. చాలా మంచి నవలలు ఉన్నాయి. వీటిలోని పాత్రలు కొన్ని ఎప్పటికీ జీవించే ఉంటాయి. అలాంటి పాత్రలలో మచ్చుకు కొన్ని - గిరీశం, బారిష్టరు పార్వతీశం, గణపతి మొదలైనవి. ఈ సంచికలో మనం బారిష్టరు పార్వతీశం గురించి ముచ్చటించుకుందాం.

మన పార్వతీశం పుట్టినప్పుడు ఒట్టి పార్వతీశమే. అతను ఓ మారుమూల పల్లెటూళ్ళో పుట్టాడు. చిన్నతనంలో చదువులోనూ, ఆటల్లోనూ చురుకుగా ఉండేవాడు. తరవాత చదువు ఒంటబట్టించుకోక పరీక్షల్లో ఫెయిల్ కూడా అయ్యాడు. 'చదివిన చదువు చాల్లే ఇహ పెళ్ళి చేసుకొని ఇంటి పట్టున ఉండి వ్యవసాయం, గొడ్డూ గోదా చూసుకో'మని తండ్రి హితవు చెప్పాడు. మన పార్వతీశానికి అది రుచించలేదు. పెద్ద చదువులు చదివి పెద్ద పేరు సంపాదించుకోవాలని మహా ఉబలాటపడ్డాడు. అందుకే ఇంట్లో చెప్పా పెట్టకుండా ఇంగ్లాండు ఉడాయించాడు.



వెనుకటికి ఒకాయన్ని 'నీ ముక్కు ఏది?' అంటే తల చుట్టూ చెయ్యి తిప్పి చూపించాడట. అలాగే మన పార్వతీశం కూడా బొంబాయి వెళ్ళి, ఇంగ్లాండుకు వెళ్ళక, మద్రాస్ వెళ్ళి కొలంబో వెడతాడు. స్టేషన్ పేరు చెప్పకుండా టిక్కట్టియ్యమని స్టేషన్ మాస్టర్ని విసిగిస్తాడు. ఏది మద్రాస్ వెళ్ళే రైలో తెలుసుకోక, రైలు కనిపించగానే లోపలికి దూరేస్తాడు. తన సామాను భద్రంగా ఉండాలని మంచి తాడుతో దాన్ని రైల్లో ఉండే అలారం గొలుసుకు కట్టేస్తాడు. మద్రాసులో ఎంతో ముచ్చటపడి ఓ టోపీ కొనుక్కొని దర్జాగా నెత్తిమీద పెట్టుకుని తిరుగుతాడు. అందరూ తనని చూసి నవ్వాక తెలుస్తుంది మన పార్వతీశానికి - అది ఆడ వాళ్ళ టోపీ అని.

ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి అది మధ్యలో ఆగకుండా పోతుంటే రైలు ఆగని చోట్ల మధ్యలో స్టేషన్‌లు ఎందుకు కట్టారో అని విస్తుపోతాడు. ఓడ దగ్గరికి తీసుకెళ్ళే పడవ ఎక్కి, అదే ఓడ అనుకుని ఇంత చిన్న పడవ అంతదూరం ఎలా వెళ్తుందని భయపడతాడు. ఎలాగో తిప్పలు పడి ఫ్రాన్స్ దేశం వెడతాడు. అక్కడ దర్జాగా ఒక పెద్ద హొటల్‌లో బస చేద్దామని వెడతాడు. తీరా చూస్తే తన సామానుని ఒక చిన్న గదిలో పెట్టి తనను అందులోకి రమ్మంటే రానని మొరాయిస్తాడు. అందరూ బలవంతాన లాక్కెళ్ళి అతన్ని ఆ గదిలో కూలేస్తారు. ఆగది పైకి

లేస్తుంది. ఇంతకీ అది గది కాదు. లిఫ్ట్... మన పార్వతీశం లిఫ్ట్‌ని గది అనుకొని తన డబ్బు కాజెయ్యటానికి చిన్నగది ఇచ్చి తనను మోసం చేస్తున్నారనుకొని అందులోకి వెళ్ళడు, అంతే.



ఇంగ్లాండ్ చేరాక రాజు అనే మిత్రుడి సహాయం వల్ల కాలేజీలో చేరతాడు. ఇంగ్లాండ్‌లో ఒకనాడు ఆబగా ఆవకాయ అన్నం తింటూ, కొంచెం ఆవకాయ రుచి చూడమని తాను ఉంటున్న ఇల్లుగలావిడకి ఇస్తాడు. ఆవిడ ఆ ఆవకాయ తిని కళ్ళవెంట నీరు కారుస్తూ లబో, దిబోమని మొత్తుకుంటుంటే పాపం పార్వతీశానికి ఎంతో జాలి వేస్తుంది. వెంటనే లేచి తన ఆవ కాయ చేతులతోనే ఆమె కళ్ళు తుడిచి ఆమెను చాలా ఇబ్బంది పెడతాడు. ఇలా ఎన్ని తెలివి తక్కువ పనులు చేసినా శ్రద్ధగా చదువుకుని పెద్ద పరీక్షలు పాసయి మన దేశానికి వస్తాడు. చదివిన చదువు డబ్బు సంపాదించడానికి కాక, దేశసేవకు ఉపయోగించాలనే నిర్ణయం తీసుకుని దేశ సేవలో మునిగిపోతాడు. ఇదీ టూకీగా పార్వతీశం కథ. ఇంతకీ దీనిని రాసింది ఎవరో తెలుసా? మొక్కపాటి నరసింహ శాస్త్రి గారు. మీరు కాస్త పెద్దయ్యాక బారిష్టరు పార్వతీశం నవల చదవండి. చాలా నవ్వొస్తుంది. బారిష్టరు పార్వతీశాన్ని జన్మలో మర్చిపోలేరు.

# బాల కళాకారులు





వివిధ రంగాల్లో చిన్న పిల్లలు తమ తమ ప్రతిభను కనబరుస్తుంటారు. చిన్న వయస్సులోనే భరతనాట్యం, పెయింటింగ్, ఆటలు, నటన ఇలాంటి అనేక విషయాలలో బాలలు తమ ప్రతిభతో మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతారు. అలాంటి బాల కళాకారులకు (ప్రతిభావంతులకు) ప్రోత్సాహం ఇచ్చి వారిలోని టాలెంట్‌ను వెలికితీసి వారికి కాస్త ప్రోత్సాహాన్నిస్తే ఎంతో ఉన్నత స్థితికి ఎదుగుతారు. అలాంటి పిల్లలకు 'చెలిమి' తన కర్తవ్యంగా వారి ఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేసే విధంగా వారి గురించి 'చెలిమి'తో అందరికి పరిచయం చేస్తుంది.

మీ పిల్లల అద్భుత ప్రతిభను తెలియజేసే వివరాలు (ఫోటోలతో సహా) పంపిస్తే 'చెలిమి'లో ప్రచురిస్తాం. దీనితో ఆ బాల కళాకా(రిణి)రుడు అందరికీ పరిచయమయ్యే అవకాశాన్ని 'చెలిమి' కలిగిస్తుంది. త్వరగా పంపించండి మరి!

# కొమరం భీమ్

సుమారు తొంభై సంవత్సరాల నాటి మాట. ఆ రోజుల్లో ఆదిలాబాదు ప్రాంతమంతా దట్టమయిన అడవులతో నిండి ఉండేది. ఆ అడవులలో ఎంతో మంది గోండులు, ఇతర గిరిజనులు, జీవించేవారు. ఆ రోజుల్లో గోండుల ముఖ్య ఆహారం ఇప్పపువ్వు. ఇప్ప పువ్వుతో రొట్టెలు, కుడుములు చేసుకుని తినేవారు.

వారానికి ఒకసారి చిన్నచిన్న పట్టణాల్లో అంగళ్ళు తెరిచేవారు. ఆ అంగళ్ళకు చేరడానికి కొన్నిసార్లు గోండులు రెండు మూడు రోజులు నడవాల్సి వచ్చేది. అంత కష్టపడి పోతే అక్కడి వ్యాపారులు గోండులను రెండు చేతులా దోచుకునేవారు. ఇది సరిపోదన్నట్లు నైజాం ఉద్యోగులు గోండులను పీడించుకు తినేవారు. ఇప్ప పువ్వు పట్టి, ఇప్ప పరకపట్టి, ఆవు పట్టి, మేక పట్టి, గడ్డి కుప్ప పట్టి అని ఇలా రకరకాల పన్నులు వసూలు చేసేవారు. పన్నులు కట్టలేని గోండులను చెట్లకు కట్టేసి చావ కొట్టేవారు. గ్రామ పట్వారీలు, నైజాం ఉద్యోగుల కంటే రెండాకులు ఎక్కువే చదివారు. గోండులు అడవిని నరికి సాగులోకి తెచ్చుకున్న భూమిని దొంగ పట్టాలు బనాయించి వాళ్ళనుంచి లాక్కునేవారు. ఇలా గోండులు అన్ని వైపులనుంచీ దోచుకోబడేవారు.

గోండుల కష్టాలు తొలిగించడానికా అన్నట్లు ఈ గోండులలో ఒకవీరుడు పుట్టాడు. అతడే కొమరం భీమ్. కొమరం భీమ్ - 1900 సంవత్సరంలో పుట్టాడు. కొద్దో గొప్పో చదువుకున్నాడు. గోండుల హక్కుల కోసం వారి తరఫున పోరాటం సాగించాలను కున్నాడు. అందుకే బాధలకు గురి అవుతున్న గోండులను ఏకం చేసి నిజాం నవాబుకు సవాలుగా నిలిచాడు. కొమరం భీమ్ నాయకత్వంలో గోండులు ఒక్కటై తమ భూములు, ఇతరులు లాక్కోకుండా అడ్డుకున్నారు. భూములు లాక్కోవడానికి



వచ్చిన వాళ్ళు తోకముడిచారు. అలాగే పన్నులు వసూలు చేయడానికి వచ్చి దుర్మార్గాలు చేయబోయిన అధికారులకు దేహశుద్ధి జరిగింది. అడవి మీద తమకే హక్కు ఉండాలని గోండులు కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు.

గోండులలో ఈ తిరుగుబాటు తత్వం అధికారులకు కలవరం కలిగించింది. ఇంకా జాప్యం చేస్తే కొమరం భీమ్ నాయకత్వాన గోండులు ఆసిఫాబాదు (అప్పటి ఆదిలాబాదు జిల్లా ముఖ్య పట్టణం)ను ఆక్రమించు కుంటారని ఆనాటి జిల్లా కలెక్టర్ అబ్దుల్ సత్తార్, ప్రభుత్వానికి విన్నవించుకున్నాడు కూడా. త్వరలో గోండుల రాజ్యం వస్తుందని అనుకుంటున్న, వాళ్ళ మాటలు విన్న ఒక తహశీల్దారుకు కాళ్ళు చేతులు చల్లబడ్డాయి.

వెంటనే ఆనాటి కలెక్టర్ వందమంది సాయుధ పోలీసులతో, ఇతర అధికారులతో కలిసి కొమరం భీమ్‌ని లొంగదీసుకోవడానికి హుటాహుటిన బయలు దేరాడు. జోడెన్ ఘాట్‌లో ఇరు పక్షాలు యుద్ధానికి తలపడ్డాయి. యుద్ధానికి ముందు అబ్దుల్ సత్తార్ కొమరం భీమ్‌కి ఎన్నో ఆశలు చూపించాడు. లొంగిపోతే 30 ఎకరాల భూమిని భీమ్‌కి ఇస్తానని రాయబారం పంపాడు కూడా. కాని కొమరం భీమ్ లొంగలేదు.

తనకు ఇచ్చే భూమికోసం కక్కుర్తిపడి తన వెనక ఉన్న వందలాది గోండులకు అన్యాయం చెయ్యనని ఖచ్చితంగా చెప్పాడు. యుద్ధం మొదలైంది. కొమరం భీమ్‌కు బాసటగా 300 మంది గోండులు యుద్ధంలో పాల్గొన్నారు. ఒక పగలు, ఒక రాత్రి యుద్ధం జరిగింది. పగటి యుద్ధంలో కొమరం భీమ్ ధాటికి ఆగలేక పోలీసులు వెనక్కి మళ్ళారు. అయితే రాత్రికి రాత్రే జోడెన్ ఘాట్ గుట్ట ఎక్కి కొమరం భీమ్ మీద విరుచుకు పడ్డారు. కొమరం భీమ్ వెనుకంజ వెయ్యకుండా అకస్మాత్తుగా మీదపడ్డ శత్రువులతో పోరాటం సాగించాడు. అతని చేతిలో ఆనాటి డి.ఎన్.వి. వెంట్రుకవానిలో చావు తప్పించుకున్నాడని అప్పటి అధికారులే అంగీకరించారు. అలా పోరాడుతున్న కొమరం భీమ్ తొడలో నుంచీ, ఛాతీలో నుంచీ తూటాలు దూసుకు పోయాయి. అయినా ఏమాత్రం చలించని కొమరం భీమ్ ముందుకు పోతూనే శత్రువుల తుపాకీ గుళ్ళకు బలి అయి వీర మరణం పొందాడు. కొమరం భీమ్ గోండులకోసం చేసిన ఆత్మత్యాగం వృధా కాలేదు. అది గోండులలో నూతన చైతన్యాన్ని కలిగించింది.



**రేపటి సూర్యుడు**

రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ ఉన్న ఈ బాలుడు చోటా రాజకీయ నాయకుడిలా కనిపిస్తున్నా నిజానికి ఇతను ఓ కవి! బాలకవి నాదాన్. ఇతని అసలు పేరు వీరేంద్రసింగ్. వీరేంద్రకు కవితలల్లటం వెన్నతో పెట్టిన విద్య. చిన్నతనం నుంచే ఈ బాలుడు కవితలల్లేవాడు. ఇప్పటికే వీరేంద్ర 300 పైగా కవితలు రచించాడు. హిందీలో రచనలు చేసే ఈ బాలకవి ఎన్నో కవి సమ్మేళనాలలో, సమావేశాలలో పాల్గొని తన కవితాగానంతో అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ఈ బాలుడు కేవలం కవి మాత్రమే కాదు. కథకుడు కూడా. ఎన్నో చక్కటి కథలు రాశాడు. ఒక సినిమాకు కథనం కూడా సమకూర్చాడు. ప్రసిద్ధ నటుడు శేఖర్ కపూర్ తాను తీయబోయే సినిమాలో నటించవలసిందిగా వీరేంద్రకు ఆహ్వానం పంపాడు. మధ్యప్రదేశ్‌లోని ఓ చిన్న గ్రామంలో జన్మించిన ఈ బాలుడు ప్రస్తుతం బొంబాయి నగరంలో పెరుగుతున్నాడు. – చందు


Phone : 66367, 62367

**MANUFCATURERS , DEALERS & FURNISHERS OF LABORATORIES IN SCHOOLS, COLLEGES, POLYTECHNICS AND I.TI's.**

***RANGE :***

**ALL TYPES OF MICROSCOPES, BALANCES, OVNES, CENTRIFUGES, STIRRERS., WATER BATHS, HOT PLATES, HEATING MANTLES, WATER DISTILLATION APPARATUS, THERMOMETERS, STOP WATCHES, PH METERS, GALVANOMETERS, RHEOSTATS, CAMERAS, BIOLOGICAL CHARTS & MODELS, ETC.**

**AUDIO-VISUAL EQUIPMENTS.**
**DISPLAY BOARDS AND AUDIO VISUAL AIDS**

DETEK

# DECCAN TEKNO CORPORATION

**3-6-475/4, HIMAYATNAGAR, HYDERABAD**


# ఎలుకకు పద్మవ్యూహం

**జం**తువుల స్వేచ్ఛను అరికట్టడంవల్ల వాటిలోని సహజమైన వివేకం దెబ్బ తింటుందా? జీవితంలో ఒక మార్గానికి అలవాటు పడ్డవి, రెండు మార్గాల్లోగాని, మూడు మార్గాల్లోగాని స్వేచ్ఛగా విహరించగల శక్తిని కోల్పోతాయా ? ఇలా వివిధ రకాల మార్గాల్లో నిర్బంధితమైన ఎలుకలు పెద్దవైనాక సాధారణ, సహజమైన వివేకాన్ని పొందగల్గుతాయా ? ఈ ప్రశ్నలకు పరిష్కారంగా ఎలుకలపై 'ఈ ఏ హర్కమ్' అనే అమెరికన్ శాస్త్రవేత్త రకరకాల పరిశోధనలు చేయడం జరిగింది.

ఆయన మూడు జతల ఎలుకల్ని చిన్నప్పటినుంచి వేరుచేసి, వేరే ఎలుకలతో కలవనీయకుండా మూడు రకాల మార్గాల్లో విడివిడిగా పెంచడం జరిగింది. ఓ జత ఎలుకల్ని భూమికి సమాంతరంగా ఉండే మార్గంలోనూ, మరో జత ఎలుకల్ని భూమికి నిటారుగా లంబంగా ఉండే మార్గంలోనూ, ఇంకో జత ఎలుకల్ని పూర్తి స్వేచ్ఛగా విహరించగల భిన్న మార్గంలోనూ పెంచి పెద్ద చేయటం జరిగింది. తొమ్మిది నెలల తర్వాత వీటన్నింటిని విడి విడిగా ఓ పద్మ వ్యూహంలాంటి కృత్రిమ పంజరంలోకి పంపడం జరిగింది.

స్వేచ్ఛగా అన్ని మార్గాల్లోనూ విహరించటానికి అలవాటు పడ్డ మూడోరకం ఎలుకలు ఈ పద్మవ్యూహంలో స్వేచ్ఛగా, సులువుగా విహరించగలిగాయి. అలాగే భూమికి లంబంగా ఉండే మార్గంలో పెరిగిన రెండవరకం ఎలుకలు కూడా ఎంతో సులువుగా ఈ పద్మ వ్యూహంలో సంచరించాయి. కాని భూమికి సమాంతరంగా పెరిగిన ఎలుకలు మాత్రం ఈ పద్మవ్యూహంలో అయోమయ స్థితిలో ఉండిపోయాయి. అందుకు కారణం వాటికి ఎత్తు, పల్లాల స్థితి గురించి సహజమైన పరిచయం చిన్నప్పటి నుంచి లేకపోవడమేనని ఈ ప్రయత్నం ఫలితంగా తేలింది.

–గిరిజా నారాయణ్





Edited & Published by Vedakumar. M on behalf of Children's Educational Academy, 10 Himayatnagar, Hyderabad - 500 029, Tel - 65669, Grams: CHELIMI, Processed at OM SAI GRAPHICS, Printed at GAYATRI ENTERPRISES, Hyd.


Every Man's First Love
VILÄN
VESTS & BRIEFS
SHAH
SESHA SAYEE KNITTINGS (P) LTD. VIJAYAWADA – 520 016.

.. 25225/89-SB/333/88 REGD. NO. H/HD/723

# మెరిసే మీపళ్ళ రహస్యం ఒక్కరికి మాత్రమే తెలుసు. జెమిని పళ్ళపొడి.



జెమిని పళ్ళపొడి- ఇప్పుడు దేశవ్యాప్తంగా వాడబడుతున్న ఏకైక తరహా పళ్ళపొడి. జెమిని పళ్ళపొడి, లవంగాలు, పిప్పర్‌మింట్ స్పియర్‌మింట్ మూడు మేలైన పదార్థాల మిశ్రమంతో తయారుచేయబడినది.
తెల్లని దృఢమైన పళ్ళను, ఆరోగ్యవంతమైన చిగుళ్ళను మీకందిస్తుంది "జెమిని". అంతేకాక నోటి దుర్వాసనని క్షణంలో చిత్తు చేస్తుంది. నేటినుండి "జెమిని పళ్ళపొడి"ని వాడండి ప్రతిరోజు... జెమిని నవ్వును మీ పెదాలపై ఒలికించండి.




## జెమిని పళ్ళపొడి

పళ్ళకు తెలుపుదనం–చిగుళ్ళకు గట్టిదనం.

జెమిని కెమికల్ ప్రోడక్ట్స్ (ఫర్మ్) పోస్ట్ బాక్స్ నం. 7, మచిలీపట్నం-521 001. ఆం.ప్ర. (ఇండియా)

OTS/GCP/2015/88

Edited & Published by Vedakumar M. on behalf of Children's Educational Academy, 10 Himayatnagar, Hyderabad-500 029, Tel-65669, Grams: CHELIMI, Processed at OM SAI GRAPHICS, Printed at GAYATRI ENTERPRISES, Hyd.